ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
శుక్రవారం 21 మార్చి 2025

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (శుక్రవారం సాయంత్రం)	సెహరీ (శనివారం ఉదయం)
రాయచోటి	6.30	4.59
మదనపల్లె	6.32	5.04
రాజంపేట	6.28	5.05
పీలేరు	6.30	4.57

ఆ రోడ్లలో ప్రయాణం నరకం...


రాయచోటి-రాజంపేట మార్గంలో సానిపాయి అడవుల్లో దెబ్బతిన్న ఘాట్ రోడ్డు


పూర్తిగా పాడైన సానిపాయి-రాయచోటి రోడ్డు

- ఘాట్‌రోడ్లలో పొంచి ఉన్న ప్రమాదం
- పాడైన రాయచోటి-రాజంపేట, చిట్వేలి-రాపూరు ఘాట్ రోడ్లు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

వైసీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులు దేవుడెరుగు కనీసం రోడ్లలో గుంతలు కూడా పూడ్చలేదు. గత ఐదేళ్లలో రోడ్లపై ఎటువంటి పనులు చేయకపోవడంతో ఘాట్ రోడ్లన్నీ పాడై ప్రమాదాలకు నెలవుగా మారాయి. ప్రస్తుత ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామీణ రోడ్లను వేస్తోంది. మొదటి విడతగా వేలాది గ్రామాల్లో సిమెంటు రోడ్లు వేశారు. రెండో దశలో మరో రూ.1800 కోట్లతో పల్లె ప్రాంతాల్లో సిమెంటు రోడ్లను వేయడానికి ప్రభుత్వం నడుం బిగించింది. ఘాట్‌రోడ్లపై కూడా ప్రభుత్వం దృష్టి పెట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

రాజంపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రాయచోటి-రాజంపేట, చిట్వేలి-రాపూరు ప్రధానమైన ఘాట్ రోడ్లు. అటవీ ప్రాంతంలో ఎత్తయిన కొండల మధ్య వేసిన రోడ్లు ఇవి. రాజంపేట రెవెన్యూ డివిజన్ కేంద్రానికి, జిల్లా కేంద్రమైన రాయచోటికి 58 కిలోమీటర్లు దూరం ఉంది. ఇందులో 30 కిలోమీటర్లు ఘాట్ రోడ్డే ఉంది. మిగిలినది సాదా రోడ్డు. ఈ రోడ్డు జిల్లా కేంద్రం ఏర్పడక ముందు నుంచి పూర్తిగా పాడైపోయి ఉంది. రాజంపేట నుంచి రాయచోటికి వెళ్లే మార్గంలో రాజంపేట వైపు మాత్రం రోడ్డును బాగు చేశారు. తర్వాత సానిపాయి అటవీ ప్రాంతం నుంచి ఈ రోడ్డును పట్టించుకోలేదు. రాజంపేట నుంచి రాయచోటికి వెళ్లేటప్పుడు పాలెం నుంచి బాలరాజుపల్లె చెయ్యేరు వంతెన వరకు ఒక ఘాట్ రోడ్డు ఉంది. దీనిని మాత్రం పూర్తి చేశారు. బాలరాజుపల్లె చెయ్యేరు బ్రిడ్జి నుంచి వేసిన రోడ్డు అసంపూర్తిగా ఉంది. ప్రధానంగా సానిపాయి అటవీ ప్రాంతంలో అందునా భారీ ఎత్తున మలుపులు ఉండి రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతంలో రోడ్డును పునరుద్ధరించకపోవడంతో రోడ్డు దెబ్బతిని గత వర్షాకాలంలో రోడ్డుకు ఇరువైపులా మొత్తం కోసుకుపోయి రాళ్లు బయటపడి పూర్తిగా పాడైపోయింది. ఏమాత్రం ఏమారినా ప్రమాదానికి గురి కావాల్సిందే. ఎదురుగా వాహనం వస్తే రోడ్డు దిగి రాళ్లపై వెళ్లాలంటే రోడ్డు ప్రమాదాలకు గురి కావాల్సిందే. దీనివల్ల వాహనాలు వెళ్లాలంటేనే చాలా కష్టంగా ఉంది.

చిట్వేలి-రాపూరు ఘాట్ నిడివి 28 కిలోమీటర్లు. 20 కిలోమీటర్లు భారీ మలుపులతో కూడిన ప్రమాదకర ఘాట్ రోడ్డు. అటు నెల్లూరు ఇటు అన్నమయ్య జిల్లాల పరిధిలోని అభయారణ్యాలు. ఈ అటవీ ప్రాంతం సగభాగం అన్నమయ్య జిల్లాలోను, మరో సగభాగం నెల్లూరు జిల్లా పరిధిలో ఉంది. అన్నమయ్య జిల్లా పరిధిలోని అటవీమార్గం రోడ్డును ఏడాది కిందటే పూర్తి చేశారు. నెల్లూరు జిల్లా వైపు అటవీ మార్గం ఘాట్‌రోడ్డుకు మరమ్మతులు చేయలేదు. ఎదురెదురుగా వాహనాలు వస్తే రోడ్డు దిగాలంటేనే భయం. దీని వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. బెంగళూరు, మదనపల్లె, పీలేరు, రాయచోటి, తంబళ్లపల్లె, రాజంపేట, రైల్వేకోడూరు నియోజకవర్గ వాసులు నెల్లూరుకు వెళ్లాలంటే ఈ రెండు ఘాట్ రోడ్ల ద్వారానే ప్రయాణం చేయాలి. అటువంటి ప్రధానమైన ఘాట్‌రోడ్ల పునరుద్ధరణపై ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఈ ఘాట్ రోడ్లలో ప్రయాణికులు అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని ప్రయాణించాల్సి ఉంటుంది. ఈ ఘాట్‌రోడ్లను పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.


చిట్వేలి-రాపూరు ఘాట్ మలుపుల వద్ద దెబ్బతిన్న ఘాట్ రోడ్డు

తిరుపతి నుంచి బెంగళూరుకు వెళ్లాల్సి వస్తోంది



రాయచోటి రోడ్డు దెబ్బతినడం వల్ల తిరుపతికి వెళ్లి అక్కడి నుంచి బెంగళూరుకు వెళ్లాల్సి వస్తోంది. జిల్లాకు సంబంధించి వేలాది మంది వివిధ వృత్తుల్లో స్థిరపడినవారు బెంగళూరులో ఉన్నారు. ప్రధానంగా సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు ఎక్కువ మంది ఉన్నారు. వీరు వారానికో నెలకో ఇంటికి రావాలంటేనే భయపడుతున్నారు. బెంగళూరు నుంచి రాజంపేటకు, రాపూరుకు వెళ్లాలంటే ఈ ఘాట్ రోడ్డు పూర్తిగా దెబ్బతినడం వల్ల రాలేకపోతున్నారు. చేసేది లేక మరో వంద కిలోమీటర్లు దూరమైనా తిరుపతికి వెళ్లి తిరుపతి ద్వారా కోడూరు, రాజంపేట, రాపూరుకు వెళుతున్నారు.

- పలుకూరి సత్యనారాయణ,
సాఫ్ట్‌వేర్ ఇంజనీర్, రాజంపేట.

ఘాట్ రోడ్లకు వెంటనే మరమ్మతులు చేయండి



రాయచోటి-రాజంపేట, రాపూరు-చిట్వేలి ఘాట్ రోడ్లను వెంటనే ప్రభుత్వం మరమ్మతులు చేయాలి. ఈ రెండు మార్గాలు పాడవ్వడం వల్ల అరచేతిలో ప్రాణాలు పెట్టుకుని పోవాల్సి వస్తోంది. ప్రయాణం ఆలస్యం కావడంతో పాటు ప్రమాదాలకు గురికావాల్సి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వెంటనే ఈ ఘాట్‌రోడ్లను పునరుద్ధరించాలి. ఈ మార్గాల్లో వెళ్లేవారంతా పల్లె ప్రాంతాల వారే. పల్లె పండుగలో భాగంగా రెండో దశలో చేపట్టే రోడ్ల నిర్మాణాల్లో ఈ రెండు రోడ్లను పూర్తి చేయాలి.

- గడికోట గుల్జార్‌బాషా,
రాష్ట్ర కార్పొరేషన్ మాజీ డైరెక్టర్, రాజంపేట

శుద్ధి జలాలను సద్వినియోగం చేసుకోండి

- స్వచ్ఛమైన నీటిని వృథా చేయొద్దు
- కడప జడ్పీ సీఈవో ఓబులమ్మ

గాలివీడు, మార్చి 20: వెలిగల్లు జలాశయం శుద్ధి జలాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీ సీఈవో ఓబులమ్మ తెలిపారు. గురువారం గాలివీడు మండలంలోని వెలిగల్లు జలాశయం వద్ద వివిధ దశల్లో జరుగుతున్న నీటిశుద్ధి ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ కృష్ణకుమార్‌తో కలిసి నీటి పారుదల శాఖ, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులతో కలిసి సమీక్షించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వెలిగల్లు జలాశయం నుంచి వెలువడే నీరు శుద్ధి చేసిన అనంతరం చాలా స్వచ్ఛంగా ఉన్నాయని, అలాంటి నీటిని అవగాహనా రాహిత్యంతో వృథా చేయడం సరికాదన్నారు. వేసవి దృష్ట్యా ప్రజలు ప్రతి నీటిబొట్టును సక్రమంగా సద్వినియోగం చేసుకునేలా అవగాహన పెంచాలని సిబ్బందికి సూచించారు. జలాశయం నుంచి వెలువడే శుద్ధి జలాలు స్కీం బోర్ల ద్వారా సక్రమంగా పంపిణీ జరుగుతున్న తీరు, ఎక్కడైనా స్కీం బోర్లలో సమస్యలు తలెత్తుతున్నాయా అనే విషయంపై ఆరా తీశారు. ఎక్కడైనా స్కీం బోర్లలో సమస్యలు తలెత్తితే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో జవహర్‌బాబు, లక్కిరెడ్డిపల్లె డీఈ విద్య, జేఈ ప్రదీప్, కృష్ణయ్య, పంచాయతీ కార్యదర్శులు, నీటి పారుదల శాఖ ఇంజనీర్లు, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది పాల్గొన్నారు.


వెలిగల్లు శుద్ధి జలాల ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కడప జడ్పీ సీఈవో ఓబులమ్మ

జూన్ నాటికి లైనింగ్ పనులు పూర్తి

- తెలుగుగంగ సీఈ వరప్రసాద్
- హంద్రీ-నీవా లైనింగ్ పనుల పరిశీలన


చిప్పిలి వద్ద హంద్రీ-నీవా లైనింగ్ పనులు పరిశీలిస్తున్న సీఈ వరప్రసాద్, ఎస్ఈ విఠల్‌ప్రసాద్, తదితరులు

మదనపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): హంద్రీ-నీవా పుంగనూరు బ్రాంచ్ కెనాల్ లైనింగ్ పనులను జల వనరుల శాఖాధికారులు గురువారం పరిశీలించారు. ఇందులో తిరుపతి తెలుగుగంగ చీఫ్ ఇంజనీర్ వరప్రసాద్, హంద్రీ-నీవా ఎస్ఈ విఠల్‌ప్రసాద్‌లు మదనపల్లె మండలం చిప్పిలి వద్ద జరుగుతున్న పనులను పరిశీలించారు. 280 క్యూసెక్కుల నీటి సామర్థ్యంతో కాలువను లైనింగ్ చేస్తున్నట్లు తెలిపారు. నీటి స్పీడు పెరగడంతో పాటు నీరు ఇంకిపోయి వృథా కాకుండా ఉండటానికే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు సీఈ, ఎస్ఈలు తెలిపారు. మే 31వతేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వ లక్ష్యం కాగా, జూన్ నాటికి పూర్తి చేసే దిశగా పనిచేస్తున్నట్లు వెల్లడించారు. అధునాతనమైన యంత్రాలతో రాత్రి, పగలు పనులు చేస్తున్నట్లు సీఈ తెలిపారు.

ఎలాంటి నీటి ఆధారం లేని మదనపల్లె, తంబళ్లపల్లె, పుంగనూరు, పీలేరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలకు హంద్రీ-నీవా వరం లాంటిదని, సకాలంలో పనులు పూర్తి చేసి కృష్ణా జలాలు సద్వినియోగం చేసుకుంటే అంతకన్నా ప్రయోజనం ఉండదన్నారు. కుప్పం బ్రాంచ్ కెనాల్‌ను రూ.169 కోట్లతో, పుంగనూరు బ్రాంచ్ కెనాల్‌ను రూ.480 కోట్లతో పనులు చేస్తున్నట్లు తెలిపారు. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో సాగు, తాగునీటికి ఇబ్బందులు ఉండవని, ఆ దిశగా ప్రభుత్వం ముందుకెళ్తున్నట్లు స్పష్టం చేశారు. అలాగే మదనపల్లె పట్టణ తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఉద్దేశించిన చిప్పిలి, గుట్టకిందపల్లె సమ్మర్ స్టోరేజీ ట్యాంకులు, నీటిశుద్ధి ప్లాంట్లు కూడా పూర్తి చేస్తామని వారు వివరించారు. అనంతరం రామిరెడ్డిగారిపల్లె, కాట్లాటపల్లె వద్ద సొరంగం మార్గాన్ని పరిశీలించారు. ఇందులో హంద్రీ-నీవా ఈఈలు సీఆర్ రాజగోపాల్, చంద్రశేఖరయ్య, నీలకంఠరెడ్డి, డీఈ, ఏఈలు పాల్గొన్నారు.

గ్రామీణుల సొంతింటి కల నెరవేర్చాలి

- పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చేంతవరకు పోరాడతాం
- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఈశ్వరయ్య

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడిచినా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో సొంతింటి కల నెరవేర్చుకోవాలన్న ఆశ సామాన్య కుటుంబాలకు అందని ద్రాక్షగా మిగిలిందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జి.ఈశ్వరయ్య అన్నారు. పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలాలు ఇచ్చి ప్రభుత్వమే ఇళ్లను నిర్మించాలని డిమాండ్ చేస్తూ గురువారం సీపీఐ రాయచోటి నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ఇంటి స్థలాల దరఖాస్తులు డీఆర్‌వోకు అందజేశారు. ఈ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ సొంత స్థలం ఉండి ఇళ్లు కట్టుకునే కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందిస్తే ఎన్నో కుటుంబాలకు మేలు జరుగుతుందన్నారు. సర్వేల పేరుతో ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వైసీపీ ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గృహ నిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని, ఎన్నికల హామీల్లో భాగంగా ప్రభుత్వం హామీ ఇచ్చినప్పటికీ అధికారంలోకి వచ్చి ఇన్ని రోజులు గడుస్తున్నా పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, సీపీఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు, ఆంధ్ర మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి సుమిత్రమ్మ, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సాంబశివ, తోపు కృష్ణప్ప, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, మహిళలు

యోగా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

- జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రదానం

రాయచోటి (కలెక్టరేట్), మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి యోగా పురస్కారాల కోసం కేంద్ర ఆయుష్ శాఖ దరఖాస్తులు స్వీకరిస్తోందని స్టెప్ సీఈవో సాయిగ్రేస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యోగాను అభివృద్ధి, ప్రొమోట్ చేస్తూ సమాజంపై కీలకంగా ప్రభావం చూపుతున్న వ్యక్తులు/సంస్థలకు ఈ పురస్కారాలు ప్రదానం చేస్తారని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఈ పురస్కారాలను ప్రకటించారు. జాతీయ వ్యక్తిగత, అంతర్జాతీయ సంస్థ కేటగిరీల్లో పురస్కారాలు ఇస్తారని పేర్కొన్నారు. ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అర్హత, ఆసక్తి గల వారు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

పనులు చేయకుండానే రూ.7.55 లక్షలు స్వాహా

- వైసీపీ నాయకుడి ఖాతాలో జమ
- సర్పంచ్ చెక్‌పవర్ రద్దు
- కార్యదర్శికి షోకాజ్ నోటీసు జారీ



జాగువారిపల్లె పంచాయతీ కార్యాలయం

పుల్లంపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జాగువారిపల్లె పంచాయతీలో 15వ ఆర్థిక సంఘం నిధుల్లో రూ.7.55 లక్షల గోల్‌మాల్ జరిగింది. ఎటువంటి పనులు చేయకుండా, వైసీపీ నాయకుడి ఖాతాకు నిధులు మళ్లించినట్లు అధికారుల విచారణలో తేలింది. ఆ గ్రామ ఉపసర్పంచ్ రాజమౌలాల్‌రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేయడంతో అధికారుల విచారణలో ఈ వ్యవహారం బయటపడింది. ఈ పంచాయతీలో 2021 నుంచి 2024 వరకు ఎటువంటి సమావేశాలు నిర్వహించలేదు. అయినా 15వ ఆర్థిక సంఘం నిధుల్లో రూ.7.55 లక్షలు ఖర్చు పెట్టినట్లుగా చూపి ఆ నిధులన్నీ వైసీపీ నాయకుడి ఖాతాకు మళ్లించినట్లు అధికారులు గుర్తించారు. ఇందులో కొంత మొత్తం వలంటీర్ల అకౌంట్లకు ట్రాన్స్‌ఫర్ చేసి ఆ తర్వాత ఆ డబ్బులను అప్పట్లో పనిచేసిన పంచాయతీ విస్తరణాధికారి, పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చినట్లు విచారణలో తేలింది. 2022లో కూడా ఈ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై సర్పంచ్‌కు చెక్‌పవర్ రద్దు చేశారు. అప్పట్లో వైసీపీ నాయకుల అండదండలతో మరుసటిరోజే చెక్‌పవర్ తిరిగి తెచ్చుకున్నారు. వీటన్నింటిపైన అధికారులు చేపట్టడంతో నిజాలు వెలుగు చూశాయి. దీంతో కలెక్టర్ చామకూరి శ్రీధర్ పంచాయతీ కార్యదర్శికి షోకాజ్ నోటీసు చేయడంతో పాటు సర్పంచ్ చెక్ పవర్ రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

టమోటా రైతులను ఆదుకోండి

- అసెంబ్లీలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి



కలికిరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): టమోటా ధరలు దారుణంగా పతనం కావడంతో లక్షలాది ఎకరాలు సాగు చేసిన రైతులు కుదేలవుతున్నారని, తక్షణం ప్రభుత్వం రంగంలోకి దిగి ధరల స్థిరీకరణ కోసం కొనుగోళ్లు చేపట్టాలని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్ రెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గురువారం శాసనసభలో స్వల్పకాలిక ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడుతూ చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల్లో టమోటా పంటను సాగు చేసి నష్టపోతున్న రైతుల కష్టాల గురించి ఆయన శాసనసభ వేదిక ద్వారా ప్రభుత్వం దృష్టి తెచ్చారు. ప్రస్తుతం అన్ని మార్కెట్‌లలోనూ కిలో టమోటాలను రూ.5 లోపలే వ్యాపారస్తులు కొంటున్నారని చెప్పారు. అన్నమయ్య జిల్లాలో మదనపల్లె, కలకడ, కలికిరి టమోటా మార్కెట్లు ప్రసిద్ధి చెందాయని, కడప, అనంతపురం జిల్లాల్లో కూడా టమోటా పంటను గరిష్ఠ స్థాయిలో సాగు చేస్తున్నారని తెలిపారు. స్థానిక మార్కెట్ కమిటీల ద్వారా గానీ లేదా ప్రభుత్వమే వ్యవసాయ శాఖ ద్వారా గానీ టమోటాలను కొనుగోలు చేయించి రైతులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. మార్కెట్ యార్డుల్లో వ్యాపారస్తులు 10 శాతం కమీషన్ వసూలు చేస్తున్నారని, దీంతో పాటు 600 కిలోలకు 60 కిలోల వరకు టమోటాలను తీసుకుంటున్నారని దీనిని నివారించి రైతులకు తక్షణ ఉపశమనం కలిగించాలని కోరారు. బహిరంగ మార్కెట్‌లో టమోటా ధరలు కుదుటపడే వరకు రైతులకు ప్రభుత్వం ఆసరా ఇవ్వాలని కోరారు.


మూల్యాంకనం పకడ్బందీగా జరగాలి

- కేంద్రాన్ని పరిశీలించిన స్టేట్ అబ్జర్వర్ మధుసూదన్

రాయచోటిటౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పరీక్షలు ముగిసిన అనంతరం చేపట్టనున్న మూల్యాంకనం అత్యంత పకడ్బందీగా జరగాలని స్టేట్ అబ్జర్వర్ మధుసూదన్ జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశించారు. పదో తరగతి పరీక్షలు ముగిసిన అనంతరం చేపట్టనున్న మూల్యాంకన కేంద్రాన్ని గురువారం ఆయన పరిశీలించారు. రాయచోటి పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలోని కేంద్రాన్ని డీఈవో సుబ్రమణ్యం, డిప్యూటీ డీఈవో శివప్రకాశ్‌రెడ్డి, జిల్లా ఓపెన్ స్కూల్ కో-ఆర్డినేటర్ కొండూరు శ్రీనివాసరాజులతో కలిసి పరిశీలించారు. కేంద్రంలో గాలి, వెలుతురుతో పాటు భద్రతా ఏర్పాట్లను తనిఖీ చేశారు. పదో తరగతి పరీక్ష జవాబుపత్రాల మూల్యాంకనం అత్యంత పకడ్బందీగా జరగాలని జిల్లా విద్యాశాఖ అధికారులకు సూచించారు. ఉపాధ్యాయులకు ఎటువంటి సమస్యలు లేకుండా అవసరమైన అన్ని రకాల ఏర్పాట్లను పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ప్రస్తుతం జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షల నిర్వహణ కోసం పరీక్షా కేంద్రాల్లో విద్యార్థుల సౌకర్యార్థం చేపట్టిన ఏర్పాట్లపై ఆరా తీశారు. ఎక్కడా ఎటువంటి మాస్ కాపీయింగ్‌కు తావు లేకుండా ప్రశాంత వాతావరణంలో పరీక్షలను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సిబ్బంది, డీఈవో కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మూల్యాంకన కేంద్రాన్ని పరిశీలిస్తున్న స్టేట్ అబ్జర్వర్ మధుసూదన్

చివరికి మిగిలేది అప్పులే..!



- కోత దశలో రాలుతోన్న పూత
- దిగుబడులూ అంతంతే..
- ఆదిలోనే అరకొర ధర
- ఆందోళనలో రైతన్నలు



ముందుగా విరివిగా పూసిన మామిడి పూత

లక్కిరెడ్డిపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అష్టకష్టాలు పడి మామిడి తోటలు సాగు చేసుకున్నాం. ఆశించిన దిగుబడులు వస్తే ఈ ఏడాదైనా కష్టాలు తీరుతాయని ఆశపడ్డాం. ప్రకృతి సహకరించకపోవడంతో పూత రాలిపోతోంది. దిగుబడులు వచ్చే సమయంలో ధర కూడా అరకొరగానే ఉంటోంది. ఇలాగైతే చివరికి మిగిలేది అప్పులేనని నియోజకవర్గంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయచోటి నియోజకవర్గంలో వేరుశనగ సాగు జూదంలా మారిపోవడంతో రైతులు ఉద్యాన పంటల వైపు దృష్టి సారించారు. బోర్లు, బావుల కింద నియోజవర్గ వ్యాప్తంగా 3,600 హెక్టార్లలో మామిడి తోటలు సాగు చేశారు. ఇక్కడ పండే మామిడి పండ్లు రుచిగా ఉండడంతో విదేశాలకు కూడా ఎగుమతి అయ్యేవి. ఈ నేపథ్యంలో పలువురు రైతులు నీరు లేకున్నా అష్టకష్టాలు పడి మామిడి మొక్కలు నాటి బతికించుకున్నారు. జన వరి నెల నుంచి మామిడిచెట్లను కన్నబిడ్డలాగా చూసుకున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఎరువులు, మందులు వాడారు. పూత విరివిగా రావడంతో ఈ ఏడాది తమ సమస్యలు తీరిపోతాయని రైతులు కోటి ఆశలు పెట్టుకున్నారు. అయితే, వారి ఆశలన్నీ అడియాసల య్యాయి. గాలివానలు రాకున్నా, పూత, పిందె రాలి పోతోందని రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అరకొరగా కాసిన లాల్‌బాగ్ కాయలు టన్ను లక్ష రూపాయలు పైగా ధర పలుకుతుందని ఆశిస్తే, రూ.60 వేల నుంచి రూ.70 వేల వద్ద నిలచి పోతోందని అంటున్నారు. దీంతో చివరికి మిగిలేది అప్పులూ, కష్టాలు, కన్నీళ్లేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పసందైన కాయల ధరే ఇలా ఉంటే, ఇక బేనీషా, బెంగుళూరు, నీలం వంటి రకాలకు ఏం ధర ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో పెనుగాలులు, వర్షాలు వస్తే పిందెలు కూడా రాలిపోతాయని రైతులు బంగ్రెడ్డి శంకర్‌రెడ్డి, రాజారెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, ఆదినారాయణ, వీరాంజనేయులు తెలిపారు. కాగా, ఇన్సూరెన్స్ పేరుతో ప్రభుత్వం ఎకరాకు రూ.2500 కట్టించుకుందని, ఇన్సూరెన్స్ ఇచ్చి తమను ఆదుకోవాలని మామిడి రైతులు కోరుతున్నారు.



అరకొరగా వచ్చిన మామిడి కాయలను పార్శల్ చేస్తున్న కూలీలు

30 ఎకరాల్లో సాగుచేశా..



నాకున్న 30 ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేశాను. చెట్లు బతికించుకోవడానికి 20 బోర్లు వేశాను. 4 బోర్లల్లో మాత్రమే నీరువస్తోంది. కొన్ని చోట్ల ట్యాంకర్ల ద్వారా నీటిని ట్యాంక్ రూ.700తో కొనుగోలు చేసి చెట్లను కాపాడుకుంటున్న సక్రమంగా పంట మంచి దిగుబడులు వస్తే 50 లక్షలు వస్తుంది. అలాంటిది ప్రతి ఏటా 10 లక్షలు రూపాయలు అప్పులే మిగులుతున్నాయి. ఉన్న పూత పిందె రాలిపోతోంది. ఈ ఏడాది నష్టాలే.

- శంకర్‌రెడ్డి, రైతు, బి.ఎర్రగుడి

పూత రాలిపోతోంది



9 ఎకరాల్లో మామిడి తోట సాగుచేశాను. నీరులేక 100 చెట్లు ఎండిపోయాయి. అరకొర పిందెను బతికించుకోవడానికి ట్యాంకర్‌తో నీరం దించా.. 20 ఏళ్ల చెట్లను వదలుకోలేక చాలా కష్ట పడుతున్నాం. ఒక్క సంవత్సరం కూడా సక్రమంగా దిగుబడి రాలేదు. ఐదేళ్లుగా సకాలంలో వర్షాలు కురవకపోవడంతో చెట్లు ఎండిపోయే పరిస్థితి ఉంది.

- లక్ష్మినారాయణ, కోనంపేట సర్పంచు

రీసర్వే వేగవంతం చేయండి: సబ్‌కలెక్టర్



బండమీదపల్లి సమీపంలో రీసర్వే పనులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

పెద్దమండ్యం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అధికారులను ఆదేశించారు. పెద్దమండ్యం మండలంలో గురువారం ఆయన పర్యటించారు. వెలిగల్లు రెవెన్యూ గ్రామంలోని బండమీదపల్లి గ్రామ పరిధిలో జరుగుతున్న రీసర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, రైతులు, రీసర్వే బృందాలతో మాట్లాడుతూ ఉమ్మడి సర్వే భూములపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భూముల భాగపరిష్కారాలు, ప్రభుత్వ భూములు, పట్టా భూములు పలు అంశాలు పరిశీలించి పక్కాగా సర్వే చేయాలన్నారు. రైతుల ఉమ్మడి భూముల సమస్య వున్న ప్రాంతంలో రెండు బృందాలు కలసి రీసర్వే పనులు నిర్వహించాలన్నారు. అనంతరం పెద్దమండ్యం సమీపంలోని లేఅవుట్‌లో పక్కాగృహ నిర్మాణాలను పరిశీలించారు. జగనన్న లేఅవుట్‌లల్లో ఎన్ని పట్టాలు ఇచ్చారు.. ఎన్ని గృహాలు, నిర్మాణ వివరాలు అధికారులు తెలియజేశారు. క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ పక్కాగా చేపట్టాలన్నారు. తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి, మండల ఆర్ఐ సయ్యద్ ఇమ్రాన్, రీ సర్వే డీటీ మౌలా, మండల సర్వేయర్ హసీన్‌తాజ్, హసింగ్ ఏఈ అక్రం, వీఆర్‌వోలు శ్రీనివాసులు, విశ్వంభరనాయుడు, నవాజ్ పాల్గొన్నారు.

పక్కా గృహాలను త్వరగా పూర్తి చేయాలి

- హౌసింగ్ పీడీ సాంబశివయ్య



వెలిగల్లు గ్రామంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ

గాలివీడు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): 2019-24 మధ్య కాలంలో మంజూరై ఇళ్లు నిర్మించుకోలేక మధ్యలో ఆగిపోయిన గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ సాంబశివయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని వెలిగల్లు గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ స్థోమత లేక ఇళ్లు నిర్మించుకోలేక మధ్యలో ఆగిపోయిన వాటికి ప్రభుత్వం అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనపు లబ్ది చేకూరుతుందని, లబ్ధిదారులు ముందుకు వచ్చి ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న పక్కా ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.350 కోట్లతో మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బుక్కే రమేశ్‌నాయక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా ఇళ్లు పూర్తి చేసుకోవాలి

- జిల్లా గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు అధికారి

రాయచోటిటౌన్, మార్చి20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక సాయంతో వేగవంతంగా ఇళ్లు పూర్తి చేసుకోవాలని జిల్లా గృహ నిర్మాణశాఖ పీవో సాంబశివయ్య లబ్ధిదారులకు సూచించారు. గురువారం ఆయన గాలివీడు మండలం ఉర్దూ స్కూల్ లేఅవుట్, ఎస్సీకాలనీ లేఅవుట్, రాయచోటి మండల పరిధిలోని కాటిమాయకుంటల్లో సిబ్బందితో కలిసి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న గృహల లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడి వారికి అవగాహన కల్పించారు. ఇంటి యూనిట్ రూ.1.80 లక్షలకు అదనంగా బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున అదనపు ఆర్థిక లబ్ధి కలుగుతుందన్నారు. గాలివీడు మండలం ఉర్దూ స్కూల్ లేఅవుట్‌లో 8, ఎస్సీ కాలనీ లేఅవుట్‌లో 12, రాయచోటి మండల పరిధిలోని కాటిమాయకుంట అరుంధతి వాడలో 14 ఎస్సీ, ఎస్టీ, బీసీల ఇళ్లు ఇర్మాణాల్లో ఉన్నాయని, వీటిని త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు.

భార్యాభర్తలకు గాయాలు



రక్తపు మడుగులో ఉన్న ఈశ్వరయ్య

సుండుపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలైన సంఘటన గురువారం మండల కేంద్రానికి సమీపంలోని రాచంవాండ్లపల్లి వద్ద చోటు చేసుకుంది. గురువారం ఉదయం 10 గంటల సమయంలో రాచంవాండ్లపల్లె వద్ద ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. సంబేపల్లె మండలానికి చెందిన జీ.ఈశ్వరయ్య, అతని భార్య, కూతురుతో కలిసి ద్విచక్రవాహనంలో మడితాడు గ్రామ పంచాయతీలోని అత్తవారింటికి వస్తుండగా సుండుపల్లె నుంచి రాయచోటికి వెళ్తున్న ఆటో ఏపీ39 టీపీ నెంబరు గల వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈశ్వరయ్యకు కుడికాలు విరిగినట్లు సమాచారం. అతని భార్యకు రక్తపు గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి క్షతగాత్రులను తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు.

శవమై తేలిన అదృశ్యమైన యువకుడు



సంఘటనా స్థలంలో మృతుడి బంధువులతో మాట్లాడుతున్న సీఐ యుగంధర్, (ఇన్‌సెట్లో) సిద్దరామయ్య (ఫైల్)

పీలేరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన యువకుడు శవమై తేలిన సంఘటన గురువారం పీలేరులో వెలుగు చూసింది. పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ కథనం మేరకు.. పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ కోళ్లఫారానికి చెందిన బెల్లం వెంకటేశ్ కుమారుడు బెల్లం సిద్దరామయ్య(36) ఈ నెల 15 నుంచి కనిపించడం లేదు. తెలిసిన వాళ్ల, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా అతను కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు రెండు రోజుల క్రితం పోలీసులను ఆశ్రయించడంతో వారు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం కోళ్లఫారం సమీపంలోని గురుకులం పాఠశాల ప్రహరీ సమీపంలో ఓ శవం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతన్ని సిద్దరామయ్యగా గుర్తించారు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేయగా వారు కూడా అతిన్ని గుర్తించారు. సంఘటనా స్థలంలో సిద్దరామయ్య మృతదేహం పక్కనే పురుగుల మందు డబ్బా ఉండడంతో అతను ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అతని మృతదేహానికి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. సిద్దరామయ్యకు భార్య భానుమతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి 50 ఎకరాలు

- గతంలో కేటాయించిన భూమిని మార్చిన ప్రభుత్వం

కలికిరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని గడికోటలో పర్యాటకాభివృద్ధి కోసం ముంతాజ్ (ఒబెరాయ్ గ్రూపు) హోటల్ నిర్మాణం కోసం గతంలో కేటాయించిన భూమిని మార్చి ప్రత్యామ్నాయంగా మరో భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒబెరాయ్ గ్రూపు చేసిన విజ్ఞప్తి మేరకు దిగువపట్నం గ్రామంలోని సర్వే నంబరు 134లో 12.48 ఎకరాలు, స.నెం. 117లో 37.52 ఎకరాలను మొత్తం 50 ఎకరాలను వెంటనే ముంతాజ్ (ఒబెరాయ్ గ్రూపు) హోటల్‌కు స్వాధీనపరచాలని కడప కలెక్టరును ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు ఏపీ టూరిజం అథారిటీ సీఈవోను తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరింది. రాష్ట్రంలో అవకాశమున్న ఐదు ప్రాంతాల్లో పర్యాటక రంగాన్ని విస్తృతంగా అభివృద్ధి చేసేందుకు అనువుగా పి-3 పద్ధతిలో అవసరమైన భూమిని లీజు విధానంలో, ఇతర మౌలిక సదుపాయాలు, నిరంతర విద్యుత్ సరఫరా తదితర అభివృద్ధి పనులను ప్రభుత్వమే చేపట్టేందుకు అనువుగా ఈ ఐదు ప్రాంతాలకు గతంలో రూ.63.37 కోట్లు కేటాయించింది. ఇక హోటళ్లు, విలాసవంతమైన రిసార్టులు నిర్మించేందుకు ఒబెరాయ్ గ్రూపు ముందుకొచ్చింది. దీనికనువుగా ప్రముఖ పర్యాటక ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో ఒబెరాయ్ గ్రూపునకు అవసరమైన భూములను సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే పేరూరు (తిరుపతి), అన్నవరం, భీమిలి (విశాఖపట్టణం), గడికోట (జమ్మలమడుగు), హార్సిలీహిల్స్ (మదనపల్లె), పిచ్చుకలంక (తూ.గోదావరి) ప్రాంతాలను ఎంపిక చేసి ఒబెరాయ్ హోటల్స్‌కు అవసరమైన భూములను అందజేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది.. ఇక గడికోటకు పర్యాటకానికి అవసరమైన 50 ఎకరాలను గడికోట గ్రామంలో 2023లోనే ప్రభుత్వం కేటాయించింది. అయితే దీనికన్నా విస్తృతంగా కనుమ దృశ్యాలను, సరోవరాన్ని పర్యాటకులు వీక్షించేందుకు అనువుగా కొత్త భూమిని కేటాయించాలని ఒబెరాయ్ ప్రతిపాదించింది. దీనికనువుగానే మును పటి కేటాయింపులకు ప్రత్యామ్నాయంగా దిగువపట్నం గ్రామంలోని 50 ఎకరాలను అప్పగించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అంతేగాకుండా ప్రస్తుతం మంజూరు చేసిన 12 మీటర్ల వెడల్పు రోడ్డుకు బదులుగా 45 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మించాలనే ప్రతిపాదనలకు కూడా ప్రభుత్వం సానుకూలత వ్యక్త పరిచింది. కొత్తగా కేటాయించిన ప్రత్యామ్నాయ భూమిని అక్కడున్న రిజర్వాయరు గరిష్ఠ వరద స్థాయిని పరిగణనలోకి తీసుకోవాలని, బఫర్ జోన్ నిబంధనల పరిధిలో అభివృద్ధి పనులు జరగాలనే షరతులతో కొత్తగా 50 ఎకరాల ప్రత్యామ్నాయ భూమిని కేటాయిస్తూ యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని యువకుడు మృతి

- ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో మృతి చెందిన మౌలా

కురబలకోట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డ విషాదకర సంఘటన గురువారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముదివేడు పంచాయతీ సాహెబుల వారిపల్లెకు చెందిన హుసేన్‌ఖాన్ కుమారుడు మౌలా(24) చికెన్‌దుకాణంలో పనిచేస్తున్నాడు. కాగా ఇతను తన సొంతపనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో అంగళ్లు వైపునకు వస్తుండగా ముదివేడు సమీపంలో మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. కాగా ఈ ప్రమాదంలో మౌలా తలకు బలమైన గాయాలు కావడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆ యుకుడిని ప్రైవేట్ వాహన సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య చికిత్సలను అందిస్తుండగా మృతి చెందాడు. కాగా మృతుడికి ఏడాదిన్నర క్రితం వివాహమైంది. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు. కాగా ప్రమాదం జరిగిన సంఘటనా స్థలానికి ముదివేడు పోలీసులు చేరుకుని విచారించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ల నిర్లక్ష్యంతోనే మృతి

- ఆసుపత్రి ఎదుట మృతుని బంధువుల బైఠాయింపు



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బంధువులు

మదనపల్లెఅర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కురబలకోట మండలం ముదివేడు వద్ద గురువారం సాయంత్రం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముదివేడుకు చెందిన చికెన్ సెంటర్ వ్యాపారి హుసేన్‌ఖాన్ కుమారుడు మౌలా (24) తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. చికిత్స నిమిత్తం స్థానిక జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే సరైన వైద్యం అందించకపోవడంతో మౌలా చనిపోయాడని మృతిని బంధువులు జిల్లా ఆసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

ముదివేడు జాతరలో రికార్డింగ్ డ్యాన్స్‌ల హోరు...!

- అర్ధనగ్న ప్రదర్శన
- డీజే వాహనం సీజ్...
- ముగ్గురిపై కేసు నమోదు



జాతర సందర్భంగా నిర్వహిస్తున్న రికార్డింగ్ డ్యాన్స్

కురబలకోట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పడమటి ప్రాంత మండలాల్లో ప్రసిద్ధి చెందిన ముదివేడు జాతరలో రికార్డింగ్ డ్యాన్స్‌లు హోరెత్తించాయి. మండలంలోని ముదివేడులో వెలసిన దండుమారెమ్మ జాతరను ఏటా సంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తారు. అయితే బుధవారం రాత్రి నిర్వహించిన జాతరలో పలువురు భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి చాందినీ బండ్లను కట్టారు. ఈ బండ్లతో పాటు మదనపల్లె, పుంగనూరు తదితర ప్రాంతాల మహిళలు, హిజ్రాలతో కొందరు నిర్వాహకులు అర్ధనగ్న ప్రదర్శనలను నిర్వహించారు. ముదివేడు పంచాయతీ గొల్లపల్లె, నడిమిపల్లె, గ్రామాల్లో మహిళలు, హిజ్రాలతో అర్ధనగ్న ప్రదర్శనలు భారీ ఎత్తున నిర్వహించడంతో పెద్ద సంఖ్యలో యువత, ప్రజలు తరలివచ్చి తిలకించారు. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 6 గంటల దాకా నిర్వహించడం గమనార్హం. ఉదయం 6 గంటలకు ముదివేడు బస్టాండుకు చేరుకోగానే అక్కడ భారీ ఎత్తున డ్యాన్స్‌లు నిర్వహించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని లాఠీఛార్జ్ చేసి జనాలను తరిమికొట్టారు. కాగా డీజే వాహనాన్ని, ముగ్గురు నిర్వాహకులపై ముదివేడు ఎస్ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై మండల వ్యాప్తంగా తెలియడంతో పలువురు జోరుగా చర్చించుకుంటున్నారు.

పేలుడు పదార్థాలతో కూలీకి గాయాలు

కలకడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోన గ్రామంలో నిర్వహిస్తున్న ఓ క్వారీలో పేలుడు పదార్థాలు పేలి రాము(45) అనే కూలీకి గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం ఉండమల్లైకు చెందిన రాము కోన సమీపంలో ఉన్న క్వారీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో క్వారీలో పేలుడు పదార్థాలను ఆరబెట్టి ఉంచారు. ఎండ వేడికి పేలుడు పదార్థాలు పేలాయి. ఈ నేపథ్యంలో పక్కనే ఉన్న రాముకు శరీరం కాలి బొబ్బలు వచ్చినట్లు తెలిపారు. గాయపడిన బాధితున్ని 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్ఐ రామాంజనేయులు తెలిపారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- డ్వామా పీడీ వెంకటరత్నం



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ

లక్కిరెడ్డిపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ, జాతీయ ఉపాధి హామీపథకం పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో సోషల్ ఆడిట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీపథకం పనులపై 16 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులపై ఈ నెల 10 నుంచి 19 వరకు సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 1639 పనులకు గానూ రూ.15,800 కోట్లు నిధులు విడుదల చేశారు. మెటీరియల్‌కు రూ.4,800 కోట్లు మంజూరయ్యాయి. ఈ సామాజిక తనిఖీకి 6 మంది డీఆర్‌పీలను నియమించారు. ఈ తనిఖీల్లో ఎక్కువగా అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నట్లు బయటపడ్డాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఉన్న ఉపాధి క్షేత్రస్థాయి సిబ్బంది తమ ఇష్టానుసారంగా నిధులు దుర్వినియోగం చేశారని ఉపాధి సిబ్బందిపై పీడీ మండిపడ్డారు. జేఈ వెంకటపతి, కంప్యూటర్ ఆపరేటర్ పవన్‌నాయక్, టీఏ విజయదుర్గాప్రసాదు, రాఘవేంద్రలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఏపీవో డిల్లీబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ నందకుమార్‌రెడ్డి, వాటర్‌షెడ్ ఏపీడీ లక్ష్మీనరసయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఉషారాణి, ఏపీడీఓ డిల్లీబాబు, టీఏలు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడికి తీవ్రగాయాలు


- రెండుగా చీలిన కాలు
- పరిస్థితి ఆందోళనకరం



తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాసులు

ములకలచెరువు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుడి కాలు రెండుగా చీలింది. దీంతో ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని వేపూరికోట పంచాయతీ ఆవులవారిపల్లెకు చెందిన శ్రీనివాసులు (50) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పొరుగు గ్రామంలోని బండమీదపల్లెలో నిర్మాణంలో ఉన్న భవనానికి మోల్డింగ్ వేయడానికి గురువారం వెళ్లాడు. అక్కడ కరెంటు రంపంతో కొయ్యలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కాలుకు తగిలి రెండుగా చీలిపోయింది. దీంతో స్థానికులు హుటాహుటిన 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు.

యువకుడు అనుమానాస్పద మృతి




అనుమానాస్పదంగా మృతిచెందిన యువకుడు

మదనపల్లెఅర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన తంబళ్లపల్లెలో చోటు చేసుకుంది. తంబళ్లపల్లె ఎస్ఐ లోకేశ్‌రెడ్డి వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండలం, గుండ్లపల్లె గ్రామం, చెట్లవారిపల్లెకు చెందిన నవీన్‌కుమార్ (24) తంబళ్లపల్లెలోని పుడమీ మార్టు అగ్రికల్చర్ ఆగ్రో ఏజెన్సీలో రెండేళ్లుగా పనిచేస్తున్నాడు. బుధవారం ఏజన్సీలో ఆడిట్ నిర్వహించి రూ.24 లక్షల సరుకు గోదాములో లేనట్లు గుర్తించారు. అక్కడే మేనేజరుగా పనిచేస్తున్న వ్యక్తి మరొకరు కలిసి నవీన్‌కుమార్‌పై నెపం మోపేందుకు యత్నించారు. గతంలో ఈ మేనేజరు మూడు ఎకరాల టమోటా సాగుకు సంబంధించి కావాల్సినవి సదరు గోదాము నుంచి తస్కరించి లెక్క చూపకుండా వాడేశారు. ఈ విషయం అంతా తెలిసిన నవీన్‌కుమార్ ఎక్కడ బయటపెడతారో అని గ్రహించి గురువారం యథావిధిగా పనికి వచ్చిన నవన్‌కుమార్‌కు అక్కడ ఉన్న పురుగుల మందు తాపించినట్లు మృతుడి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. గోదాము వద్ద అపస్మారక స్థితిలో ఉన్న నవీన్‌కుమార్‌ను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. సమాచారం అందుకున్న తంబళ్లపల్లె పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. గోదామ్ మేనేజరు కృష్ణమూర్తి, ఇద్దరి వర్కర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తునట్లు చెప్పారు. యువకుడిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

అడవులతో ఆహ్లాదం... ఆనందం






ప్రతి సంవత్సరం మార్చి 21న అంతర్జాతీయ అటవీ దినోత్సవం నిర్వహిస్తారు. మొట్టమొదటి సారిగా 1971లో ఆహార వ్యవసాయ సంస్థ మార్చి 21న ప్రపంచ అటవీదినోత్సవం నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. ఈ రోజున ప్రపంచ వ్యాప్తంగా అడవుల రక్షణ కోసం అంతర్జాతీయంగా సహకారం సమన్వయం పెంచుకుంటూ ప్రజలతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా చేపట్టనున్నారు. అంతేకాకుడా అడవుల ప్రాముఖ్యత, ఉపయోగం గురించి ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు అటవీ అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.

- జీవరాశులకు మనుగడ
- పచ్చదనం పెంపునకు అటవీశాఖ చర్యలు
- నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం

కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పచ్చని అడవులు పర్యావరణానికి, జీవరాశుల మనుగడకు ఎంతో ముఖ్యపాత్రను పోషిస్తు న్నాయి. కానీ వివిధ అవసరాల కోసం మాన వులు ప్రస్తుత రోజుల్లో చెట్లను తెగనరికి అడవుల విధ్వంసానికి పాల్పడుతున్నారు. ప్రజా అవసరాల, పర్యావరణ సమతుల్యం కోసం అడవులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

పచ్చదనం పెంపు

అడవుల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చనే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ పచ్చదనం పెంపునకు అట వీశాఖ చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో నిధుల ద్వారా ఐదు లక్షల మొక్కల పెంపకాన్ని చేపడుతున్నారు. ఇందులో 67వేల మొక్కలు అట వీశాఖ అడవుల్లో నాటడం జరుగుతుంది. మిగి లిన మొక్కలన్నీ ప్రజలకు పంపిణీ చేసి ఇంటింటా చెట్టు ఊరూరా వనం అనే విధంగా మొక్కల పెంపకాన్ని చేపట్టను న్నారు. వన్యప్రాణులను సంరక్షించేందుకు ఫేస్ ఫోర్ కెమెరా ట్రాకింగ్ ఎక్సైజ్‌లో భాగంగా టైగర్ జోన్ పరిధిలో 180 లోకేషన్‌లలో అధునాతన కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. ముద్దనూరు, వేంపల్లె మినహాయించి ఇతర అన్ని ప్రాంతా ల్లో ఈ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు అటవీ శాఖ ఉన్నత అధికార యంత్రాంగం పేర్కొంటుంది.



నగరవనాల ఏర్పాటుతో...

మనసుకు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన నగరవనాలు మానవాళికి ఆనందం ఆహ్లాదాన్ని అంది స్తున్నాయి. జిల్లాలో కడప, బద్వేల్, గండికోట, ప్రొద్దుటూరు, పులివెందులలో నగరనాలు ఏర్పా టు చేశారు. కడప నగరంలో ప్రస్తుతం ఉన్న నగరవనానికి పక్కనే మరికొంత స్థలంలో నగర వనాన్ని విస్తరించనున్నారు. ఇందుకోసం రూ.2కోట్లు ఖర్చు చేయనుండగా కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.1.40 కోట్లు మంజూరయ్యాయి. వీటితో మరికొన్ని మొక్కల పెంపకం, మౌలిక వసతుల కల్పన, తదితర అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో ప్రస్తుతం ఉన్న ఎకో పార్కునే మరింత అభివృద్ధిపరచి ప్రజలకు నగరవనాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు సమాచారం. వీటితో పాటు కమలాపురం నగర పంచాయతీలోని చెప్పలి రోడ్డులో, మైదుకూరు నియోజకవర్గంలోని ముదిరెడ్డిపల్లె వద్ద కూడా నగరవనాలను ఏర్పాటు చేసేందుకు అటవీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. వన విహారిలో భాగంగా సోమశిల వెనకజలాల్లో అనువైన చోట చిల్డ్రన్స్ పార్కు, యాత్రికులు రాత్రివేళల్లో బస చేసేందుకు వీలుగా ఏర్పాటు చేయనున్నారు. అదేవిధంగా బోటింగ్ నిర్వహించేందుకు కూడా టూరిజం శాఖతో అటవీ అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.



అడవులను సంరక్షించుకోవాలి

అడవుల ప్రాముఖ్యత, వాటి పరిరక్షణకు జరుగుతున్న ప్రయత్నాలు మన పర్యావరణ వ్యవస్థలో అవి పోషిస్తున్న కీలక పాత్ర గురించి ప్రతి ఒక్కరు అవగాహన పొంది ఉండాల్సిన అవసరం ఉంది. మీడియా ద్వారా ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నాం. జిల్లాలో ప్రస్తుతం అనేక రకాల అటవీ సంరక్షణ కార్యక్రమాలు చేపడుతున్నాం. మన అడువులను సంరక్షంచుకోవాల్సిన బాద్యత మనందరిపై ఉంది.

-వినీత్‌కుమార్, జిల్లా అటవీ అధికారి

కుమ్మరాంపల్లెలో పట్టపగలే చోరీ

- రూ.6లక్షల విలువైన బంగారు, వెండి అపహరణ

వేంపల్లె, మార్చి 20 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కుమ్మరాంపల్లె గ్రామ సమీ పంలో గండి-వేంపల్లె ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. 6.50 తులం బంగారు ఆభరణాలు, కిలోన్నర వెండిచోరీ చేసినట్లు బాధితుడు మధుసూధన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశా రు. వివరాలిలా.. కుమ్మరాం పల్లె సమీపంలో మధుసూ దన్‌రెడ్డి నివాసం ఉంటున్నా డు. గురువారం ఉదయం పని నిమి త్తం ఇంటికి తాళాలు వేసి భార్య భర్తలు వేంపల్లెకు వెళ్లారు. సాయంత్రం 7.30 గంటలకు ఇంటికెళ్లి చూడగా ఇంటి తలుపు చిలుకు బద్దలు కొట్టి ఉండడం గమనించి.. లోపలికి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఇంట్లో ఉన్న 6.50 తులం బంగారు ఆభర ణాలు, కిలోన్నర వెండి చోరీ చేశారని.. వీటి విలువ సుమారు రూ.6ల క్షలకు పైగా ఉంటుందని బాధి తుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సురేష్‌రెడ్డి, ఎస్‌ఐ రంగారావు ఘటన స్థలాన్ని పరిశీలించి.. క్లూస్ టీం ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

దువ్వూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ బాలికపై మాబూ షరీఫ్ అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన ఘటనపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వినోద్‌కుమార్ తెలిపారు. బాలికకు మాయమాటలు చెప్పి అఘాయిత్యానికి పాల్పడినట్లు బాధితురాలి తల్లి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మాబూ షరీఫ్‌పై పోక్సో కేసు నమోదు చేశామని చెప్పారు.

పశువైద్య విద్యార్థుల సమ్మె విరమణ



సమ్మె విరమణ లేఖను కళాశాల డీన్ శ్రీనివాసప్రసాద్‌కు అందిస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉపకార వేతనాలు పెంచాలన్న డిమాండ్‌తో 45 రోజులుగా పశువైద్య కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారంతో సుఖాంతమైంది. ప్రస్తుతం అందిస్తున్న ఉపకార వేతనాలకు 50 శాతం మేరకు పెంచుతూ ప్రభుత్వం నుంచి జీవో విడుదలైంది. ఈ సందర్భంగా కళాశాలలోని అండర్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ విద్యార్థులు కాలేజీ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అసోసియేట్ డీన్ శ్రీనివాసప్రసాద్‌కు సమ్మె విరమిస్తున్నట్లు లేఖను సమర్పించారు. తరగతులకు హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు శివతరుణ్, రాహుల్, రోహిత్, రమేష్, హృదయ, తదితరులు మాట్లాడుతూ ఈ జీవోతో తాము సంతోషంగా లేమని, అయితే ప్రభుత్వ బడ్జెట్, పరిమితులను పరిగణలోకి తీసుకుని సమ్మెను తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని పేర్కొన్నారు. తమ సమ్మెకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞత తెలిపారు.

జూన్ నాటికి గండి ఆలయాన్ని ప్రారంభించాలి

- దేవదాయ ధర్మాదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్



ఆలయాన్ని పరిశీలిస్తున్న ఆర్జేసీ, డీసీ

చక్రాయపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గండి వీరాజనేయ స్వామి దేవస్థాన పనులు పూర్తిచేసి జూన్ నాటికి ప్రారంభించాలని దేవదాయ ధర్మాదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, కర్నూలు డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్‌లు పేర్కొన్నారు. గురువారం గండి అంజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, ముఖ్యఅర్చకులు గోపాలస్వామి, వేదపారాయణ పండితుడు రామ్మోహన్‌శర్మలు వారికి పూర్ణఫలంతో స్వాగతం పలికి ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం గండిలో జరుగుతున్న ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేసి ఎట్టిపరిస్థితుల్లో జూన్‌కు గండి అంజన్న స్వామిని భక్తులు దర్శించుకోవాలన్నారు. కొత్తగా నిర్మించే దేవాలయంలో క్యూలైన్లు, అద్దాలమండపం, ప్రహరీ, పడమర రాజ గోపురం పనులను పరిశీలించి.. త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే దేవస్థానంలో ఆకుపూజలు, టెంకాయలు, క్యూలైన్ల ఏర్పాట్లు తదితర వాటిపై చర్చించారు. ఏది ఏమైనా ఆగమశాస్త్ర ప్రకారం దేవాలయాన్ని పరిశీలించాలని కోరారు. అనంతరం వసతి గృహాలు, ప్రసాదాలపై ఆరాతీశారు. రికార్డులను తనిఖీ చేశారు. భావితరాలకు బాసటగా గండి ఆంజనేయ స్వామి భక్తులకు నిలవాలన్నారు. ఎంతో పురాతన ఆలయమని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఒక ప్లాన్ ప్రకారం ఆలయంలో పనులు చేపట్టాలని కోరారు. దేవస్థాన మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఈఓ విశ్వనాథరెడ్డి, ఈఓ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బంగారం పేరుతో బురిడీ.. వ్యక్తి అరెస్టు

- రూ.4.50 లక్షలు స్వాధీనం



మాట్లాడుతున్న డీఎస్పీ భావన, సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎస్ఐ సంజీవ రెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులోని దొరసానిపల్లె రోడ్డులో కీర్తి జనరల్‌స్టోర్ నిర్వాహకులను బంగారం పేరిట నకిలీ బంగారం ఇచ్చి 5.20 లక్షల సొమ్ము కాజేసిన వ్యక్తిని వన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం సాయంత్రం స్థానిక వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎస్‌ఐ సంజీవరెడ్డితో కలిసి డీఎస్పీ భావన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరిలో కీర్తి జనరల్ స్టోర్‌కు చెందిన యజమాని చిట్టిబోయిన కీర్తి దుకాణంలో ఉండగా ఇద్దరు వ్యక్తులు తాము భార్యభర్తలమని.. ఇదే ఏరియాలో నివాసం ఉంటున్నామని తెలిపారు. జనరల్ స్టోర్‌లో సరుకులు కొనేవారమని తాము బెంగుళూరులో బిల్డింగ్ పనుల కోసం గుంతలు తీస్తుండగా బంగారు బిస్కెట్లు దొరికాయని చెప్పారు. ఫిబ్రవరి 21 కీర్తి జనరల్ స్టోర్‌కు వెళ్లిన మహిళ తమ వద్ద బంగారు బిస్కట్‌వుందని.. తక్కువ ధరకే ఇస్తామని చెప్పగా కీర్తి తన భర్తను అడిగి చెప్తానన్నారు. మరుసటి రోజు మరోసారి ఆ మహిళ భర్త వెళ్లి బంగారు రూ 25 లక్షలు అవుతుందని మీకు కేవలం రూ.5లక్షలకే ఇస్తామంటూ బంగారు పరీక్షించుకోవచ్చని ఒక బంగారు ముక్క ఇచ్చారన్నారు. దాన్ని బంగారు దుకాణంలో పరీక్షించగా అది నాణ్యతకలదని తెలియడంతో కీర్తి రామకృష్ణ దంపతులు బంగారు బిస్కెట్ కొనేందుకు ఆసక్తి చూపి ఫిబ్రవరి 23న వారి నుంచి బంగారు బిస్కెట్ రూ.5.20 లక్షలు ఇచ్చి తీసుకున్నారన్నారు. ఆ తరువాత బిస్కెట్ నాణ్యతను బంగారు దుకాణంకు వెళ్లి పరీక్షించగా అది నకిలీదని తేలిపోయిందన్నారు. దీంతో దాన్ని విక్రయించిన వారికి ఫోన్‌చేయగా వారి ఫోన్‌స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో మోసపోయామని గుర్తించి వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. వారి ఫిర్యాదు మేరకు నకిలీ బంగారంతో బురిడీ కొట్టించిన వారికోసం గాలింపు మొదలెట్టామన్నారు. గురువారం మధ్యాహ్నం మెయిన్ బజార్‌లోని కళామందిర్ వద్ద నిందితుడు బండారు నాగేశ్వరరావును అరెస్టు చేసి.. అతని వద్ద నుంచి రూ.4,50,000లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని.. త్వరలో పట్టుకుంటామన్నారు.

అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

కడప మారుతీనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వారి ఆధ్వర్యంలో ఆర్మీ డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ సారధ్యంలో అగ్నిపథ్ పథకం కింద అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో వివిధ కేటగిరీలైన అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీసర్ అసిస్టెంట్, స్టోర్ కీపర్, ట్రెడ్‌మెన్, తదితర ఉద్యోగాల నియామకాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం ప్రప్రథమంగా ఆన్‌లైన్‌లో కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (సీఈఈ)ను తెలుగులో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్‌సీసీ-ఎ బీ అండ్ సీ సర్టిఫికెట్ గల అభ్యర్థులకు, ప్రతిభావంతులైన క్రీడాకారులకు, అగ్నివీర్ టెక్నికల్ కేటగిరి అభ్యర్థులకు, ఐటీఐ డిప్లొమా వారికి అదనపు మార్కులు ఉంటాయన్నారు. అర్హత గల అభ్యర్థులు వచ్చే ఏప్రిల్ 10వ తేదీ లోపు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

రేపు ఉద్యోగమేళా

కడప మారుతీనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ (స్కిల్‌హబ్)లో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఇందులో పేటీఎం, డోనో బీపీఓ అండ్ ఐటీ సొల్యూషన్ ప్రయివేట్ లిమిటెడ్, ఎయిల్ డిక్షిన్ (కిరణ్ సర్వీసెస్) కేఎల్ గ్రూప్ తదితర కంపెనీలలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, టెలీ కాలింగ్ ఆఫీసర్, అసెంబ్లింగ్ ఆపరేటర్స్ అండ్ క్వాలిటీ, వేర్‌హౌస్ అసోసియేట్ ఉద్యోగాల కోసం 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఎనీ డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్హత కలిగి 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి వుండాలన్నారు. ఎంపికైన వారికి నెలకు 12 వేల నుంచి 25 వేల వరకు హోదాను బట్టి ఇస్తారన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధృవపత్రాలు, ఫొటోస్ తీసుకుని రావాలన్నారు.

మెడిసిన్ సామగ్రి భద్రపరచేందుకు గోడౌన్ ఏర్పాటు చేయాలి

కడప మారుతీనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ద్వారా వచ్చే మందుల సామగ్రి భద్రపరచుటకు వీలుగా డీఎంఅండ్ హెచ్‌వో కార్యాలయ ఆవరణలో ప్రత్యేక గోడౌన్ ఏర్పాటు చేయాలని భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) జిల్లా కార్యదర్శి చాగలమర్రి ఓబులయ్య ప్రభుత్వాన్ని కోరారు. బీజేవైఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టరు అదితిసింగ్‌ను కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. జిల్లా ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అవసరమైన మందుల సామగ్రి నిల్వచేయడానికి సరైన గోడౌన్ సౌకర్యం లేకపోవడంతో ఆ కార్యాలయంలోనే నిల్వ చేస్తున్నారన్నారు. ప్రభు త్వం స్పందించి గోడౌన్ సౌకర్యం కల్పించాలని కోరారు.

తెలుగుగంగ ఈఈగా క్రిష్ణారెడ్డి



బాధ్యతలు స్వీకరించిన క్రిష్ణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల తెలుగుగంగ ఈఈ గా క్రిష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన తెలుగు గంగ ఈఈగా, ఇన్‌చార్జ్ డీఈగా తెలుగుగంగ ప్రాజెక్టులో విధులు నిర్వహించారు. గురువారం ఆయన రెగ్యులర్ ఈఈగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనను సన్మానించారు.

దిగుబడి రాక.. ధరలు లేక !

- ఆందోళనలో పత్తి రైతులు



రాజుపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించే రైతన్నలకు కష్టనష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది పత్తిపంట సాగు చేసిన రైత న్నలు దిగుబడి రాక.. ధరలు లేక దిగాలు చెందుతున్నారు. ఎకరాకు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడి మాత్రం వస్తోంది. దీనికితోడు పత్తి కొనుగోలుకు వ్యాపారస్తులు ముందుకు రాకపోవడం, జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలు లేకపోవడం కూడా ధరలు లేకపోవడానికి కారణమని రైతులు చెబుతున్నారు. ప్రస్తుతం క్వింటా రూ.4500 నుంచి 5500 ధర పలుకుతోంది. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని కోరుతున్నారు. కాగా, మండ లంలో గతంలో 12వేల నుంచి 15వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేసేవారు. రానురాను పత్తి పంటకు తెగుళ్లు ఆశించడం, ధరలు లేకపోవడంతో కొంత మంది రైతులు పత్తి సాగు చేయడం మానుకున్నారు. ప్రత్యామ్నాయ పంటలైన మినుము, జొన్న తదితర పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో గుంటూరు, ఆదోని, తదితర మార్కెట్ల ద్వారా మిల్లులకు సంవత్సరానికి రాజుపాలెం మండలం నుంచి 200 నుంచి 400 లారీలు పత్తి ఎగుమతి చేసేవారు. నేడు 50 లారీలు పత్తి కూడా పంపే పరిస్థితి లేదు.



లారీకి లోడు చేసిన పత్తి

జాతీయస్థాయి చెస్ పోటీల్లో లాస్యశ్రీ ప్రతిభ



లాస్యశ్రీని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

కడప స్పోర్ట్స్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మహారాష్ట్ర నారదవాడ జిల్లాలో జరిగిన స్కూలు గేమ్స్ చెస్ అండర్ 17 కేటగిరి జాతీయస్థాయి పోటీల్లో నగర గాంధీ నగర్ మున్సిపల్ కార్పోరేషన్ స్కూలు విద్యార్థిని లాస్యశ్రీ బ్రాంచ్ మెడల్ సాధించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఆఫ్రిషన్ గురువారం లాస్యశ్రీని అభినందించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. తద్వారా ఇటు తల్లిదండ్రులకు అటు పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. కాగా రాష్ట్రస్థాయిలో విజయం సాధించి జాతీయ స్థాయిలో సైతం లాస్యశ్రీ రాణించి బ్రాంచ్ మెడల్ సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

‘మిగులు భూములు పేదలకు పంచాలి’

రాయచోటి(కలెక్టరేట్),మార్చి20(ఆంధ్రజ్యోతి): మిగులు భూములు పేదలకు పంచాలని వ్యవసాయ కార్మిక సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి తోపు కృష్ణప్ప డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరు నియోజకవర్గంలోని పుల్లంపేట, ఓబులవారిపల్లె, రైల్వేకోడూరు, తంబళ్లపల్లి నియోజకవర్గంలోని మొలకలచెరువు, గుడుపల్లి వద్ద చెన్నప్పగారిగడ్డ భూములు 270 ఎకరాలు పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జయరామయ్య, వినయ్, వెంకట్రమణ, మల్లిక, ఎం. వెంకట్రమణ, రమణ, వెంకటననసమ్మ, శంకర, మునికాటయ్య, రామప్ప, లక్ష్మమ్మ, కుమారి తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహిస్తున్న నాయకులు

రంజాన్ మాస ఉపవాస దీక్షలు పుణ్య కార్యక్రమం

● ఇఫ్తార్ విందులో టీడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు

రాయచోటి టౌన్,మార్చి20(ఆంధ్రజ్యోతి): రంజాన్ మాసంలో చేపట్టే ఉపవాస దీక్షలు పరమ పవిత్ర పుణ్య కార్యక్రమం అని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. గురువారం ఆయన రాయచోటి పట్టణంలోని గాలివీడు రోడ్డులో గల దూదేకులపల్లె అహమ్మదీయా ముస్లిం పెద్దలు రసూల్, రిజ్వాన్, షబ్బీర్ ఆధ్వర్యంలో ఇచ్చిన ఇఫ్తార్ విందుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా రంజాన్ పవిత్ర మాసం సందర్భంగా ఇచ్చిన ఇఫ్తార్ విందుకు వచ్చిన సుగవాసి ప్రసాద్‌బాబుకు ఘనస్వాగతం పలికి సన్మానించారు.అనంతరం ఆయన ముస్లింలతో కలిసి ప్రార్థనలు నిర్వహించారు. మైనార్టీ నేతలు కొండూరు రసూల్, వంకిరిపల్లి బాషా, వల్లూరి కుమార్, కొండూరు అమీర్, చిన్నప్ప, పాలగిరి చిన్నరెడ్డి, పాలగిరి చికెన్‌పీరా, పాలగిరి పీరయ్య, మహాబుద్దీన్‌సాబ్, దూదేకులపల్లి యూత్, గోపాల్ పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో భోజనం వడ్డిస్తున్న సుగవాసి ప్రసాద్‌బాబు

చిత్రం చెప్పిన సమస్య


లక్కిరెడ్డిపల్లె మండలం అనంతపురం వడ్డెపల్లెకు 2014లో అంగన్వాడీ భవనం మంజూరు కావడంతో దాన్ని స్లాబ్ వరకు నిర్మించి వదిలేశారు. నాటి నుంచి నేటికీ దాని గురించి పట్టించుకున్న పాపానపోలేదు. అధికారులు స్పందించి ఆ భవనాన్ని పూర్తిచేసి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

- లక్కిరెడ్డిపల్లె, (ఆంధ్రజ్యోతి)


సిద్దవటం మండలంలోని కొమరనాయునిపల్లె ప్రభుత్వ పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. టాయిలెట్, బాత్‌రూం గదులు లేక విద్యార్థులు ఇబ్బందిపడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నాడు-నేడు కింద సర్కారీ బడుల రూపురేఖలు మారుస్తామని పనులు చేపట్టినా అవి పూర్తికాలేదు. పైగా విద్యార్థినీ, విద్యార్థులకు టాయిలెట్, బాత్‌రూం గది ఒక్కటే ఉండడంతో ప్రధానంగా విద్యార్థినులు ఇబ్బందిపడుతున్నారు.

- సిద్దవటం, (ఆంధ్రజ్యోతి)

గురుకుల కళాశాలలో ప్రవేశానికి గడువు పెంపు

నందలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మహాత్మాజ్యోతి బాపూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల బాలికలు నందలూరు నందు 5, 6 తరగతులు, ఇంటర్మీడియట్‌లో ప్రవేశాలకు గడువును మార్చి 15 నుంచి 25వ తేదీ వరకు పొడిగించినట్లు ప్రిన్సిపల్ నాగేశ్వరి తెలిపారు. ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్‌ఈఐఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసి పరీక్ష రాసి ఉత్తీర్ణులైనవారికి మాత్రమే పాఠశాలలో, కళాశాలలో అడ్మిషన్ లభిస్తాయని పేర్కొన్నారు.

కేజీబీవీల్లో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

రామాపురం, మార్చి20(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కేజీబీవీల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 6, 11 తరగతుల్లో ప్రవేశాల కోసం బాలికల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరించనున్నట్లు కస్తూర్బా ప్రిన్సిపాల్ పుష్పలత పేర్కొన్నారు. ఏప్రిల్ 11 వరకు గడువు ఉందన్నారు. అనాథలు, బడిబయట పిల్లలు, డ్రాపౌట్స్ పేద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, బీపీఎల్ బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ దరఖాస్తును హెచ్‌టీటీపీ://ఏపీకేజీబీవీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్/ వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చన్నారు. ఎంపికైన విద్యార్థులకు ఫోన్ ద్వారా సమాచారం అందుతుందన్నారు.

చేనేత కార్మికులకు ఉచిత విద్య హర్షణీయం

సిద్దవటం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : చేనేత మగ్గాలకు 200 యూనిట్లు, పరమగాలాలకు 500 యూనిట్లు ఉచిత విద్యుత్‌ను ఇవ్వడం ఏపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని జనసేన రాష్ట్ర చేనేత వికాస కార్యదర్శి రాటాల రామయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని ఉప్పరపల్లె జనసేన పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఉచిత విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం ముందుకు రావడం, చేనేత కార్మికులకు ఎంతో ఉపయుక్తంగా మారుతుందని అభిప్రాయపడ్డారు. ఉచిత విద్యుత్‌తో చేనేత కుటుంబాలు తమ పనిని నిరవధికంగా కొనసాగించడం వల్ల ఈ రంగం మరింత అభివృద్ధి చెందుతున్నారు. విద్యుత్ వ్యయం తగ్గడంతో మగ్గాల పనితీరు మెరుగుపడి ఉత్పత్తి పెరిగే అవకాశం ఉందన్నారు.

అర్జీదారుడు లేకుండానే భూమి కొలతలు

పెనగలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సిరివరం గ్రామంలో సర్వేనంబరు 251లో పొలాలకు వెళ్లే డొంక దారిని అర్జీదారుడు లేకుండానే తప్పులు తడకగా సర్వే చేసినట్లు రైతు బెడుదూరి అంజయ్య తెలిపారు. బుధవారం తనకు తెలియకుండానే పెనగలూరు తహసీల్దారు అమరేశ్వరి అధ్యక్షతన జరిగిన రీసర్వేలో తాను నాలుగు ఇంచెలు ఆక్రమణ చేసినట్లు నిర్ధారించుకుని సర్వే చేసి వెళ్లడం దారుణమని వాపోయాడు. ఈ విషయంపై తహసీల్దారు అమరేశ్వరిని వివరణ కోరగా రైతుకు రెండు వారాలు గడువు ఇచ్చి ఇచ్చామన్నారు.

అంగన్వాడీలకు శిక్షణ

రామాపురం, మార్చి20(ఆంధ్రజ్యోతి):మండలంలోని హసనాపురం పంచాయతీ కొండవాండ్లపల్లె జెడ్పీ పాఠశాలలో గురువారం అంగన్వాడీ టీచర్లకు పోషణ బీ, బాడాయి బీ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్‌వైజర్లు సుజాతమ్మ, పద్మజారాణి, హుస్సేనమ్మ మాట్లాడుతూ నేటి నుంచి శనివారం వరకు శిక్షణ ఉంటుందన్నారు. మండలంలోని అంగన్వాడీ టీచర్లను రెండు గ్రూపులుగా ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

భగత్‌సింగ్ వర్ధంతిని జయప్రదం చేయండి

రాజంపేట టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : భగత్‌సింగ్ 94వ వర్ధంతి సభలు మార్చి 23న నిర్వహించనున్నామని, జయప్రదం చేయాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గీతాంజలి డిగ్రీ కళాశాల ఆవరణంలో గురువారం జిల్లా అధ్యక్షుడు నేతి నాగేశ్వర కరపత్రాలను విడుదల చేశారు.

ముళ్లపొదల తొలగింపు

వీరబల్లి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): వీరబల్లి మండలం వంగిమళ్ల గ్రామానికి వెళ్లే రహదారికి ఇరువైపుల అడ్డంగా ఉన్న ముళ్ల పొదలను గురువారం ఎస్‌డీకేఆర్ డిగ్రీ కళాశాల డైరెక్టర్ రవిశేఖర్‌రెడ్డి సొంత ఖర్చులతో తొలగించారు. గత రెండు నెలల క్రితం అధికారులకు తెలియజేసినా పట్టించుకోకపోవడంతో వాహనదారులకు ఎదురుగా వచ్చే వాహనాలు కనపడక ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. వీఆర్‌డీఎస్ సురేంద్రారెడ్డి, అలి కుమార్, జేసీబీ రాజు తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంచడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు


కార్యక్రమంలో పాల్గొన్న ఫారెస్ట్ రేంజి అధికారి కళావతి, జనసేన పార్టీ నేత కృష్ణ

సిద్దవటం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో నైపుణ్యతను పెంచడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతో ఉపయోగపడుతుందని జనసేన పార్టీ పార్లమెంట్ సమన్వయకర్త అతికారి కృష్ణ అన్నారు. సిద్దవటం వెంకటేశ్వర ఇంగ్లీషు మీడియం స్కూల్లో గురువారం నిర్వహించిన సైన్స్‌ఫెయిర్‌కు రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ సమన్వయకర్త అతికారి కృష్ణ, ఫారెస్ట్ రేంజ్ అధికారి కళావతి, విశ్రాంత మండల విద్యాశాఖాధికారి శంకరయ్య హాజరై మాట్లాడారు. పాఠశాల కరస్పాండెంట్ వినోద్, ఉపాధ్యాయులు వారిని సత్కరించారు. ఫారెస్ట్ రేంజి అధికారిణి కళావతి మాట్లాడుతూ ప్రాజెక్టు అద్భుతంగా తయారు చేశారన్నారు.

వీధిలైట్లు వెలిగించాలి: సీపీఐ

పెనగలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముద్రపల్లె పంచాయతీ పరిధిలో గల రాజుపాళెంలో వీధిలైట్లు వెలిగించాలని గురువారం సీపీఐ నాయకులు ఆదినారాయణ, శంకరయ్య, గ్రామ ప్రజలతో కలిసి గురువారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు గ్రామ కార్యదర్శి వీధిలైట్లు విచారించగా సోమవారం వరకు గడువు కావాలని కోరినట్లు తెలిపారు. సీపీఐ నాయకులు రంగనాదం, నరసింహులు, రామయ్య, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఆదరణ 3 పై అవగాహన కార్యక్రమం

గాలివీడు, మార్చి20 (ఆంధ్రజ్యోతి): ఆదరణ 3 పై మండలంలోని బీసీ కులవృత్తి సంఘాల నాయకులతో ఎంపీడీవో కార్యాలయంలో గురువారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. కొత్తరకం పనిముట్లతో ఆదాయం, నైపుణ్యం పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు ఏవో జాబీర్‌అహమ్మద్ తెలిపారు. సంఘాల నాయకులు నాగేశ్వరరావు, శ్రీకాంత్, వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: ప్రభుత్వం త్వరలో అమలు చేయబోతున్న ఆదరణ-3 పథకం గురించి వివిధ వృత్తుల్లో పని చేసే ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో మల్‌రెడ్డి తెలిపారు. ప్రభుత్వం ద్వారా ఉపాధి కల్పించేందుకు అవకాశం ఉన్న మార్గాలవైపు వెళ్లేందుకు వీలుగా సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

బీసీలు ఆర్థికంగా స్థిరపడాలి

నందలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : బీసీలు ఆర్థికంగా స్థిరపడాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో రాధాకృష్ణంరాజు, ఈవోఆర్డీ సునీల్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ సభాభవనంలో చేతివృత్తులు, కుల వృత్తులవారితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ కులానికి చెందిన చేతివృత్తులు, కుల వృత్తులవారికి అవసరమైన అధునాతన పనిముట్ల వివరాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు.

సిద్దవటం: ఆదరణ పథకం కింద బీసీ కులవృత్తులకు పనిముట్ల కోసం పలు సలహాలు, సూచనలను నేడు మధ్యాహ్నం 3 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో అందజేస్తారని ఎంపీడీవో ఫణిరాజకుమారి తెలిపారు. నాయీబ్రాహ్మణులు, రజకులు, వడ్డెర, మత్స్యకారులు, చేనేత, స్వర్ణకారులు, వడ్రంగి, కల్లుగీత, కుమ్మరి తదితర బీసీ కులాలకు చెందినవారు

రేపు సంబేపల్లె సంత వేలం పాట

సంబేపల్లె, మార్చి20(ఆంధ్రజ్యోతి): సంబేపల్లె వేలం పాట మార్చి 22వ తేదీన నిర్వహించనున్నట్లు పంచాయతీ అధికారి మోహన్‌బాబు తెలిపారు. సంత వేలం పాటతో పాటు గ్రామ పంచాయతీ గదుల వేలం కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ సచివాలయంలో ఉదయం 10.30 గంటలకు వేలంపాట ఉంటుందన్నారు. రుసుం చెల్లించి వేలంపాటలో పాల్గొనాలని తెలిపారు.

బాధిత కుటుంబాలకు ‘ముక్కా’ సాయం


చెక్కును పంపిణీ చేస్తున్న ముక్కా వరలక్ష్మి

రైల్వేకోడూరు రూరల్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఏనుగుల దాడిలో గత నెల 20న మృతి చెందిన కుటుంబాలకు గురువారం ముక్కా రూపానందరెడ్డి ఫౌండేషన్ అధినేత ముక్కా వరలక్ష్మి సాయం అందించారు. బాధిత కుటుంబాల ఇంటికి వెళ్లి మూడు లక్షల రూపాయిల చెక్కును పంపిణీ చేశారు. మండలంలోని బుడుగుంటపల్లి పంచాయతీ పరిధిలోని ఎస్టీ కాలనీకి చెందిన తుపాకుల మణెమ్మ కుటుంబానికి రూ.లక్ష తిరుపతి చెంగ్రాయుడు కుటుంబానికి రూ.లక్ష, ఉర్లగడ్డపోడు వంకాయల దినేష్ కుమార్ కుటుంబానికి రూ.లక్ష చెక్కులను పంపిణీ చేశారు. టీడీపీ నాయకులు సిద్దేశ్వర, తిరుపతి చంద్రశేఖర్, కొలవెల్లి సుబ్బరామిరెడ్డి, ఉడుము శివరెడ్డి, కుటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి: డీహెచ్‌పీఎస్

రాయచోటిటౌన్, మార్చి20(ఆంధ్రజ్యోతి): మానవ హక్కుల ఉల్లంఘటనకు పాల్పడడమే కాకుండా, అక్రమ కేసులు బనాయిస్తానని ఫిర్యాదు దారులనే బెదిరిస్తున్న గాలివీడు మండల పోలీసు సబ్‌ఇన్స్‌పెక్టర్ రామకృష్ణపై ఎస్పీ తగు చర్యలు తీసుకోవాలని దళిత హక్కుల పోరాట సమితి (డీహెచ్‌పీఎస్) అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి మండెం సుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన రాయచోటి పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో మాట్లాడుతూ గాలివీడు మండలానికి చెందిన భార్య, భర్తలు చుక్కా రామక్రిష్ణ, జ్యోతిల మధ్య అనే సంవత్సరాలుగా కుటుంబ కలహాలు ఉన్నాయని తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఈ నెల 3వ తేదీన జ్యోతి తన బంధువుల సహకారంతోనే తన భర్త రామక్రిష్ణపై దాడి చేయించి, హత్యాయత్నానికి పాల్పడిందన్నారు. దాడి అనంతరం రామక్రిష్ణ రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొంది, అవుట్ పోస్ట్ పోలీసుల ద్వారా దాడి జరిగిన విషయంపై ఫిర్యాదు చేశారన్నారు. అయితే ఎస్ఐ రామక్రిష్ణ దాడికి పాల్పడిన వారికి అనుకూలంగా వ్యవహరిస్తూ రామక్రిష్ణ ఫిర్యాదును నిర్లక్ష్యం చేశారన్నారు. ఎస్ఐ ఆగడాలపై జిల్లా పోలీస్ ఉన్నతాధికారులు తగు చర్యలు తీసుకోవాలని డిమండ్ చేశారు. లేకుంటే దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాధితుడు చుక్కా రామకృష్ణ పాల్గొన్నారు.

రైస్ కార్డులకు ఈకేవైసీ పూర్తి చేయాలి

పెనగలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని 16 పంచాయతిల్లోని రేషన్ షాపుల్లో 12.57 శాతం రైస్ కార్డు హోల్డర్లకు ఈకేవైసీ లేదని, వెంటనే రేషన్‌షాపు డీలర్లు 4449 మంది ఈకేవైసీ లేని రేషన్‌కార్డుదారులకు ఈనెల 31లోగా ఈకేవైసీ చేయించాలని పెనగలూరు తహసీల్దారు డి.అమరేశ్వరి రేషన్ షాపు డీలర్లకు తెలిపారు. గురువారం సాయంత్రం ఆమె తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఉండగా ఈకేవైసీ చేయించుకుని తమ పరిధిలోని రేషన్‌షాపునకు వెళ్లి ఈకేవైసీ చేయించుకోవాలని ఆమె కోరారు.

రంజాన్ పండుగను సంతోషంగా జరుపుకోవాలి


బట్టలు పంపిణీ చేస్తున్న మహమ్మద్ ఖాన్

రాయచోటిటౌన్, మార్చి20(ఆంధ్రజ్యోతి): పవిత్రమైన రంజాన్ పర్వదినాన్ని అందరూ సంతోషంగా జరుపుకోవాలని వైసీపీ అన్నమయ్య జిల్లా మైనార్టీ అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్ తెలిపారు. రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి, ఈద్గా ప్రాంతాల్లో గురువారం కులమతాలకు అతీతంగా 500 మంది పేదింటి మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అల్లా ఆశీస్సులతో అంతా మంచి జరగాలని మహిళలు ఆకాంక్షించారు.

హామీలను వెంటనే నెరవేర్చాలి : సీపీఐ

రాజంపేట టౌన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జల ఈశ్వరయ్య తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలన్నారు. రాజంపేట పట్టణంలో 15 రోజుల క్రితం గంజాయి పట్టుబడితే కనీసం మూడు గంటల సమయంలోనే గంజాయి దొంగలను రిలీజ్ చేశారన్నారు. గంజాయి నిర్మూలనపై ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే పోలీసులు ఆ ఆవ్యక్తిని ఏవిధంగా వదిలారని ప్రశ్నించారు. సీపీఐ రాజంపేట నియోజకవర్గ కార్యదర్శి శివరామకృష్ణదేవర, జిల్లా కార్యవర్గ సభ్యుడు చిన్నయ్య, రాజంపేట పట్టణ కార్యదర్శి ఇ.సికిందర్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, సీపీఐ నాయకులు నాగేశ్వరరావు, వినయ్, రమణ పాల్గొన్నారు.

పశువుల సంత, బస్టాండు గేటు వేలం


మాట్లాడుతున్న డీపీవో మస్తాన్‌వలి

రావాపురం, మార్చి20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వారాంతపు శనివారం నిర్వహించే పశువుల సంత పాటు బస్టాండు గేటు వేలం గురువారం సాయంత్రం నల్లగుట్టపల్లె సర్పంచ్ అయోధ్యాపురం నాగభూషణ్‌రెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించారు. ఈ వేలం పాటలో 10 మంది సభ్యులు పాల్గొన్నారు.పశువుల సంతకు కనపర్తి చంద్రశేఖర్‌రెడ్డి రూ.20 లక్షలు, బస్టాండు గేటు సాకే. వెంకట్రమణ రూ.1.60 లక్షలు పాడి దక్కించుకున్నాడు.పెద్దవి ఆవు, గేదెకు, ఎనుము ఒక్కొక్క దానికి రూ.40, చిన్నవాటికి ఒక్కదానికి రూ.20 చొప్పున, అలాగే పెద్దవి మేక, గొర్రెకు రూ.25, చిన్నపిల్లలకు రూ.10, బస్టాండు గేటుకు బస్సు లేక లారీ, టిప్పర్లకు రూ.15, జీపు, ట్రాక్టర్ ట్యాక్స్‌కి రూ.10, ఆటోలకు రూ.8 చొప్పున ఉంటుందని, అలాగే ఆర్టీసీ బస్సులు, గవర్నమెంట్ జీపునకు మినహాయింపు ఉంటుందని డీపీవో మస్తాన్‌వలి తెలిపారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రమేశ్‌రెడ్డి, ఈవోపీఆర్‌డీ పట్నాయక్, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, పంచాయతీ కార్యాలయం సిబ్బంది పాల్గొన్నారు.

బస్టాండ్ గేటు, గదులకు వేలం

లక్కిరెడ్డిపల్లె, మార్చి 20(ఆంధ్రజ్యోతి): లక్కిరెడ్డిపల్లె పంచాయతీ బస్టాండ్ గేటు, గదులను గురువారం టీడీపీ మండల మైనార్టీ నాయకుడు షేక్ ఆరీఫుల్లా వేలం పాటలో రూ.1,55,000కు దక్కించుకున్నారు. చిరువ్యారులకు, బస్టాండ్ గేటు, గదులను ఉచితంగా ఇచ్చారు. దీంతో చిరువ్యాపారులు ఆనందం వ్యక్తం చేశారు. ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఉషారాణి, సర్పంచు అహల్య, ఉప సర్పంచు రాజారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు

వ్యక్తి ఆత్మహత్య


మృతుడు రాజేంద్రనాయుడు

రాయచోటిటౌన్, మార్చి20 (ఆంధ్రజ్యోతి): రాయచోటి పట్టణంలోని ఎంజీఆర్ షాపింగ్ మాల్ వెనుక వీధిలో గురువారం సాయంత్రం రాజేంద్రనాయుడు(38) అనే వ్యక్తి ఇంట్లో చార్జింగ్ వైరుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆయన మృతి పట్ల కుటుంబ సభ్యులు, బంధువులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసుల కథనం మేరకు.. పెద్దమండ్యెం మండలం రెక్కవాండ్లపల్లెకు చెందిన రాజేంద్ర నాయుడు గత కొంత కాలంలో రాయచోటి పట్టణంలోని వాసం ఉంటూ హోటల్‌లో పనిచేస్తున్నాడు. ఈ నేపథ్యంలో హోటల్‌లో ఘర్షణ జరిగినట్లు తెలిసింది. ఇంట్లో ఉన్న ఇనుప కడ్డీకి మొబైల్ చార్జింగ్ వైరుతో ఉరివేసుకున్నాడు. ఈ విషయం భార్య గుర్తించి బంధువులకు తెలిపింది. రాజేంద్రనాయుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ బీవీ చలపతి తెలిపారు.



ఎమ్మెల్యేల క్రీడా పోటీల్లో 100 మీటర్ల పరుగుపందెంలో మొదటి స్థానం పొంది సీఎం చంద్రబాబు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న రైల్వేకోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్

పేద దిబ్బలను తొలగించండి

సిద్దవటం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) :పేడ దిబ్బలను తొలగించాలని ఎంపీడీవో ఫణిరాజకుమారి సూచించారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్ ప్రోగ్రాంలో భాగంగా జ్యోతి గ్రామంలో గురువారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీసీ రోడ్లపై ఇరువైపుల ఉన్న పేడ దిబ్బలు వెంటనే తొలగించాలన్నారు. అనంతరం గ్రామ సచివాలయంలో సిబ్బందితో సమావేశమై నీటిఎద్దడి లేకుండా చూడాలని, పొడిచెత్త, తడిచెత్త వేరు చేసి హరిత రాయబారులకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సుబ్బమ్మ, మండల విస్తరణాధికారి మెహతాజ్‌యాస్మిన్, పంచాయతీరాజ్ ఏఈ నాగరాజు, ఉపాధి హామీ ఏపీవో నరసింహులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి: డీఈ


మాట్లాడుతున్న డీఈ మురళీక్రిష్ణ

రైల్వేకోడూరు, మార్చి 20(ఆంధ్ర జ్యోతి): నూతన గృహ నిర్మాణాలకు దరఖాస్తులు చేసుకోవాలని రైల్వేకోడూరు గృహ నిర్మాణ శాఖ డీఈ మురళీక్రిష్ణ తెలిపారు. గురువారం రైల్వేకోడూరు ఆయన మాట్లాడు తూ రైల్వేకోడూరు మండలం లో ఇప్పటికే 897 మంది కొత్తగా దరఖాస్తులు చేసుకున్నట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎస్సీ, ఎస్టీ, బీసీలు గృహ నిర్మాణాలకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ. 75,000 ఇస్తారన్నారు. రైల్వేకోడూరు 580 మంది లబ్ధి పొందుతారన్నారు. ఈ నెల 30 వరకు గడువు ఉందన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ

ఓబులవారిపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి) : ఐసీడీఎస్ రైల్వేకోడూరు ప్రాజెక్టు పరిధిలోని ఓబులవారిపల్లె మండలంలోని ముక్కావారిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషన్ బీ, పడాయి బీ అంగన్వాడీ కార్యకర్తల ట్రైనింగ్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా సీడీపీవో టీవీ సౌభాగ్యమ్మ, ఏసీడీపీవో సరళాదేవిల ఆధ్వర్యంలో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. మొదటిరోజు శిక్షణ కార్యక్రమంలో భాగంగా పోషన్ బీ, పడాయి బీ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. కార్యక్రమ ప్రాముఖ్యతను వివరించారు.

పుల్లంపేట: మండల పరిదిలోని అనంతంపల్లె జడ్పీ హైస్కూల్లో గురువారం అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ బీ, పడాయి బీ పై సీడీపీవో సౌభాగ్యం ఆధ్వర్యంలో శిక్షణ ఇచ్చారు. మూడు సంవత్సరాల లోపు పిల్లలకు నవచేతన, 8 సంవత్సరాల లోపు పిల్లలకు ఆదార్మిల గురించి విద్యా పోషకాహారం తదితర వాటిపై శిక్షణ ఇచ్చారు. అంగన్వాడీ కేంద్రాల్లో నైపుణ్యం పెంపొందించుకునేందుకు గృహ సందర్శన దివ్యాంగుల పిల్లలను గుర్తించడం, పిల్లల్లో పెరుగుదల వాటి గురించి శిక్షణలో వివరించారు. అంగన్వాడీ కేంద్రాల అభివృద్ధిపై శిక్షణ ఇచ్చారు.

కండక్టర్‌పై యువకుల దాడి

నందలూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కడప నుంచి రాజంపేట వైపు వెళుతున్న ఏపీ05-జడ్-5087 నంబరు గల ఏపీఎస్ ఆర్టీసీ బస్సులోని కండక్టరుపై ఈనెల 16న ఆదివారం రాత్రి నందలూరు బస్టాండు కూడలిలో కొంత మంది యువకులు దాడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ సంఘటనకు సంబంధించి కొన్ని చిత్రాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. నందలూరు గ్రామానికి చెందిన ఇద్దరు ముస్లిం మహిళలు తమ పిల్లలతో కడపలో బస్సు ఎక్కి నందలూరుకు 3 ఫుల్ టిక్కెట్, ఒక ఆఫ్ టిక్కెట్ ఇవ్వమని బస్సు కండక్టర్‌కు 500 రూపాయలు నోటు ఇవ్వగా అందుకు కండక్టర్ బస్సు టిక్కెట్ ఇచ్చి 500 రూపాయల నోటును క్యాష్‌బ్యాగులో కాకుండా ప్యాంటు జేబులో పెట్టుకున్నాడు. తర్వాత ఆ ముస్లిం మహిళ మిగతా చిల్లర ఇవ్వమని అడుగ్గా అందుకు కండక్టర్ ఎందుకు పదే పదే అడుగుతున్నావు ఇస్తాను అని చెప్పాను కదా అన్నారు. అయితే బస్సు ఒంటిమిట్ట బస్టాఫ్ వద్దకు వచ్చిన తర్వాత ఆ మహిళ మళ్లీ బస్సు కండక్టర్ వద్దకు పోయి తనకు రావాల్సిన చిల్లర ఇవ్వమని కండక్టర్‌ను అడిగింది. అందుకు కండక్టర్ ఆ మహిళతో నువ్వు ఇచ్చింది 200 రూపాయలు మాత్రమే 500 ఇవ్వలేదన్నారు.ఈ విషయాన్ని ఆమె నందలూరులో ఉన్న ఆమె బంధువులకు ఫోన్ చేసి తెలిపింది. బస్సు నందలూరుకు రాగానే ఆమె బంధువులు కండక్టర్‌పై దాడి చేశారు. రాజంపేట రూరల్ సీఐ బీవీ రమణ మాట్లాడుతూ సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేయవద్దని సీఐ హెచ్చరించారు.

పోలీసులకు ఫిర్యాదు

నందలూరు బస్టాండు కూడలిలో ఈనెల 16వ తేదీ రాత్రి కండక్టర్‌పై దాడిచేసిన సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఆర్టీసీ డీఎం రమణయ్య తెలిపారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ తమ కండక్టర్ పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఏఎస్ఐ సుబ్బరాయుడు మాట్లాడుతూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు తెలిపారు.

రీసర్వే వేగవంతం చేయండి: సబ్‌కలెక్టర్



బండమీదపల్లి సమీపంలో రీసర్వే పనులు పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

పెద్దమండ్యం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): భూముల రీసర్వే ప్రక్రియను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని మదనపల్లి సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ అధికారులను ఆదేశించారు. పెద్దమండ్యం మండలంలో గురువారం ఆయన పర్యటించారు. వెలిగల్లు రెవెన్యూ గ్రామంలోని బండమీదపల్లి గ్రామ పరిధిలో జరుగుతున్న రీసర్వే పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ మాట్లాడుతూ అధికారులు, రైతులు, రీసర్వే బృందాలతో మాట్లాడుతూ ఉమ్మడి సర్వే భూములపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. భూములు భాగపరిష్కారాలు, ప్రభుత్వ భూములు, పట్టా భూములు పలు అంశాలు పరిశీలించి పక్కాగా సర్వే చేయాలన్నారు. రైతుల ఉమ్మడి భూముల సమస్య వున్న ప్రాంతంలో రెండు బృందాలు కలసి రీసర్వే పనులు నిర్వహించాలన్నారు. అనంతరం పెద్దమండ్యం సమీపంలోని లేఅవుట్‌లో పక్కాగృహ నిర్మాణాలను పరిశీలించారు. జగనన్న లేఅవుట్‌లల్లో ఎన్ని పట్టాలు ఇచ్చారు.. ఎన్ని గృహాలు, నిర్మాణ వివరాలు అధికారులు తెలియజేశారు. క్షేత్రస్థాయిలో వివరాల సేకరణ పక్కాగా చేపట్టాలన్నారు. తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, హౌసింగ్ డీఈ వెంకటరెడ్డి, మండల ఆర్‌ఐ సయ్యద్ ఇమ్రాన్, రీ సర్వే డీటీ మౌలా, మండల సర్వేయర్ హసీన్‌తాజ్, హసింగ్ ఏఈ అక్రం, వీఆర్‌వోలు శ్రీనివాసులు, విశ్వంభరనాయుడు, నవాజ్ పాల్గొన్నారు.

పక్కా గృహాలను త్వరగా పూర్తి చేయాలి

● హౌసింగ్ పీడీ సాంబశివయ్య



వెలిగల్లు గ్రామంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న హౌసింగ్ పీడీ

గాలివీడు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): 2019-24 మధ్య కాలంలో మంజూరై ఇళ్లు నిర్మించుకోలేక మధ్యలో ఆగిపోయిన గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ సాంబశివయ్య పేర్కొన్నారు. గురువారం మండలంలోని వెలిగల్లు గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ స్థోమత లేక ఇళ్లు నిర్మించుకోలేక మధ్యలో ఆగిపోయిన వాటికి ప్రభుత్వం అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు అదనపు లబ్ధి చేకూరుతుందని, లబ్ధిదారులు ముందుకు వచ్చి ఇళ్లు నిర్మించుకోవాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అసంపూర్తిగా ఉన్న పక్కా ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం రూ.350 కోట్లతో మంజూరు చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ బుక్కే రమేశ్‌నాయక్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా ఇళ్లు పూర్తి చేసుకోవాలి

● జిల్లా గృహ నిర్మాణశాఖ ప్రాజెక్టు అధికారి

రాయచోటిటౌన్, మార్చి20(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎస్సీ, ఎస్టీ, బీసీ గృహ నిర్మాణ లబ్ధిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక సాయంతో వేగవంతంగా ఇళ్లు పూర్తి చేసుకోవాలని జిల్లా గృహ నిర్మాణశాఖ పీవో సాంబశివయ్య లబ్ధిదారులకు సూచించారు. గురువారం ఆయన గాలివీడు మండలం ఉర్దూ స్కూల్ లేఅవుట్, ఎస్టీకాలనీ లేఅవుట్, రాయచోటి మండల పరిధిలోని కాటిమాయకుంటల్లో సిబ్బందితో కలిసి వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్న గృహల లబ్ధిదారులతో ముఖాముఖి మాట్లాడి వారికి అవగాహన కల్పించారు. ఇంటి యూనిట్ రూ.1.80 లక్షలకు అదనంగా బీసీ, ఎస్సీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున అదనపు ఆర్థిక లబ్ధి కలుగుతుందన్నారు. గాలివీడు మండలం ఉర్దూ స్కూల్ లేఅవుట్‌లో 8, ఎస్టీ కాలనీ లేఅవుట్‌లో 12, రాయచోటి మండల పరిధిలోని కాటిమాయకుంట అరుంధతి వాడలో 14 ఎస్సీ, ఎస్టీ, బీసీల ఇళ్లు ఇర్మాణాల్లో ఉన్నాయని, వీటిని త్వరగా పూర్తి చేసుకోవాలన్నారు.

భార్యాభర్తలకు గాయాలు



రక్తపు మడుగులో ఉన్న ఈశ్వరయ్య

సుండుపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలకు తీవ్ర గాయాలైన సంఘటన గురువారం మండల కేంద్రానికి సమీపంలోని రాచంవాండ్లపల్లి వద్ద చోటు చేసుకుంది. గురువారం ఉదయం 10 గంటల సమయంలో రాచంవాండ్లపల్లె వద్ద ఆటో, ద్విచక్రవాహనం ఢీకొన్నాయి. సంబేపల్లె మండలానికి చెందిన జీ.ఈశ్వరయ్య, అతని భార్య, కూతురుతో కలిసి ద్విచక్రవాహనంలో మడితాడు గ్రామ పంచాయతీలోని అత్తవారింటికి వస్తుండగా సుండుపల్లె నుంచి రాయచోటికి వెళ్తున్న ఆటో ఏపీ39 టీపీ నెంబరు గల వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. ఈశ్వరయ్యకు కుడికాలు విరిగినట్లు సమాచారం. అతని భార్యకు రక్తపు గాయాలయ్యాయని పోలీసులు తెలిపారు. స్థానికులు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి క్షతగాత్రులను తరలించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు.

శవమై తేలిన అదృశ్యమైన యువకుడు



సంఘటనా స్థలంలో మృతుడి బంధువులతో మాట్లాడుతున్న సీఐ యుగంధర్, (ఇన్‌సెట్లో) సిద్దరామయ్య (ఫైల్)

పీలేరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన యువకుడు శవమై తేలిన సంఘటన గురువారం పీలేరులో వెలుగు చూసింది. పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ కథనం మేరకు.. పీలేరు మండలం కాకులారంపల్లె పంచాయతీ కోళ్లపారానికి చెందిన బెల్లం వెంకటేశ్ కుమారుడు బెల్లం సిద్దరామయ్య(36) ఈ నెల 15 నుంచి కనిపించడం లేదు. తెలిసిన వాళ్లు, స్నేహితుల ఇళ్ల వద్ద వెతికినా అతను కనిపించకపోవడంతో కుటుంబసభ్యులు రెండు రోజుల క్రితం పోలీసులను ఆశ్రయించడంతో వారు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం మధ్యాహ్నం కోళ్లపారం సమీపంలోని గురుకులం పాఠశాల ప్రహరీ సమీపంలో ఓ శవం ఉన్నట్లు పోలీసులకు సమాచారం అందింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అతన్ని సిద్దరామయ్యగా గుర్తించారు. ఈ విషయాన్ని కుటుంబసభ్యులకు తెలియజేయగా వారు కూడా అతిన్ని గుర్తించారు. సంఘటనా స్థలంలో సిద్దరామయ్య మృతదేహం పక్కనే పురుగుల మందు డబ్బా ఉండడంతో అతను ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు. అతని మృతదేహానికి పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించారు. సిద్దరామయ్యకు భార్య భానుమతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

చివరికి మిగిలేది అప్పులే..!



● కోత దశలో రాలుతోన్న పూత
● దిగుబడులూ అంతంతే..
● ఆదిలోనే అరకొర ధర
● ఆందోళనలో రైతన్నలు



ముందుగా విరివిగా పూసిన మామిడి పూత



అరకొరగా వచ్చిన మామిడి కాయలను పార్శల్ చేస్తున్న కూలీలు

లక్కిరెడ్డిపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): అష్టకష్టాలు పడి మామిడి తోటలు సాగు చేసుకున్నాం. ఆశించిన దిగుబడులు వస్తే ఈ ఏడాదైనా కష్టాలు తీరుతాయని ఆశపడ్డాం. ప్రకృతి సహకరించకపోవడంతో పూత రాలిపోతోంది. దిగుబడులు వచ్చే సమయంలో ధర కూడా అరకొరగానే ఉంటోంది. ఇలాగైతే చివరికి మిగిలేది అప్పులేనని నియోజకవర్గంలోని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాయచోటి నియోజకవర్గంలో వేరుశనగ సాగు జూదంలా మారిపోవడంతో రైతులు ఉద్యాన పంటల వైపు దృష్టి సారించారు. బోర్లు, బావుల కింద నియోజవర్గ వ్యాప్తంగా 3,600 హెక్టార్లలో మామిడి తోటలు సాగు చేశారు. ఇక్కడ పండే మామిడి పండ్లు రుచిగా ఉండడంతో విదేశాలకు కూడా ఎగుమతి అయ్యేవి. ఈ నేపథ్యంలో పలువురు రైతులు నీరు లేకున్నా అష్టకష్టాలు పడి మామిడి మొక్కలు నాటి బతికించుకున్నారు. జనవరి నెల నుంచి మామిడిచెట్లను కన్నబిడ్డలాగా చూసుకున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి ఎరువులు, మందులు వాడారు. పూత విరివిగా రావడంతో ఈ ఏడాది తమ సమస్యలు తీరిపోతాయని రైతులు కోటి ఆశలు పెట్టుకున్నారు. అయితే, వారి ఆశలన్నీ అడియాసలయ్యాయి. గాలివానలు రాకున్నా, పూత, పిందె రాలిపోతోందని రైతులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అరకొరగా కాసిన లాల్‌బాగ్ కాయలు టన్ను లక్ష రూపాయలు పైగా ధర పలుకుతుందని ఆశిస్తే, రూ.60 వేల నుంచి రూ.70 వేల వద్ద నిలచి పోతోందని అంటున్నారు. దీంతో చివరికి మిగిలేది అప్పులూ, కష్టాలు, కన్నీళ్లేనని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పసందైన కాయల ధరే ఇలా ఉంటే, ఇక బేనీషా, బెంగుళూరు, నీలం వంటి రకాలకు ఏం ధర ఉంటుందని ఆందోళన చెందుతున్నారు. ఏప్రిల్, మే నెలల్లో పెనుగాలులు, వర్షాలు వస్తే పిందెలు కూడా రాలిపోతాయని రైతులు బండ్రెడ్డి శంకర్‌రెడ్డి, రాజారెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, ఆదినారాయణ, వీరాంజనేయులు తెలిపారు. కాగా, ఇన్సూరెన్స్ పేరుతో ప్రభుత్వం ఎకరాకు రూ.2500 కట్టించుకుందని, ఇన్సూరెన్స్ ఇచ్చి తమను ఆదుకోవాలని మామిడి రైతులు కోరుతున్నారు.

30 ఎకరాల్లో సాగుచేశా..



నాకున్న 30 ఎకరాల్లో మామిడి తోటలు సాగు చేశాను. చెట్లు బతికించుకోవడానికి 20 బోర్లు వేశాను. 4 బోర్లల్లో మాత్రమే నీరువస్తోంది. కొన్ని చోట్ల ట్యాంకర్ల ద్వారా నీటిని ట్యాంక్ రూ.700తో కొనుగోలు చేసి చెట్లను కాపాడుకుంటున్న సక్రమంగా పంట మంచి దిగుబడులు వస్తే 50 లక్షలు వస్తుంది. అలాంటిది ప్రతి ఏటా 10 లక్షలు రూపాయలు అప్పులే మిగులుతున్నాయి. ఉన్న పూత పిందె రాలిపోతోంది. ఈ ఏడాది నష్టాలే.

- శంకర్‌రెడ్డి, రైతు, బి.ఎర్రగుడి

పూత రాలిపోతోంది



9 ఎకరాల్లో మామిడి తోట సాగుచేశాను. నీరులేక 100 చెట్లు ఎండిపోయాయి. అరకొర పిందెను బతికించుకోవడానికి ట్యాంకర్‌తో నీరం దించా.. 20 ఏళ్ల చెట్లను వదలుకోలేక చాలా కష్టపడుతున్నాం. ఒక్క సంవత్సరం కూడా సక్రమంగా దిగుబడి రాలేదు. ఐదేళ్లుగా సకాలంలో వర్షాలు కురవకపోవడంతో చెట్లు ఎండిపోయే పరిస్థితి ఉంది.

- లక్ష్మినారాయణ, కోనంపేట సర్పంచు

ఒబెరాయ్ హోటల్ నిర్మాణానికి 50 ఎకరాలు

● గతంలో కేటాయించిన భూమిని మార్చిన ప్రభుత్వం

కలికిరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని గడికోటలో పర్యాటకాభివృద్ధి కోసం ముంతాజ్ (ఒబెరాయ్ గ్రూపు) హోటల్ నిర్మాణం కోసం గతంలో కేటాయించిన భూమిని మార్చి ప్రత్యామ్నాయంగా మరో భూమిని కేటాయిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒబెరాయ్ గ్రూపు చేసిన విజ్ఞప్తి మేరకు దిగువపట్నం గ్రామంలోని సర్వే నంబరు 134లో 12.48 ఎకరాలు, స.నెం. 117లో 37.52 ఎకరాలను మొత్తం 50 ఎకరాలను వెంటనే ముంతాజ్ (ఒబెరాయ్ గ్రూపు) హోటల్‌కు స్వాధీనపరచాలని కడప కలెక్టరును ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు ఏపీ టూరిజం అథారిటీ సీఈవోను తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా కోరింది. రాష్ట్రంలో అవకాశమున్న ఐదు ప్రాంతాల్లో పర్యాటక రంగాన్ని విస్తృతంగా అభివృద్ధి చేసేందుకు అనువుగా పి-3 పద్ధతిలో అవసరమైన భూమిని లీజు విధానంలో, ఇతర మౌలిక సదుపాయాలు, నిరంతర విద్యుత్ సరఫరా తదితర అభివృద్ధి పనులను ప్రభుత్వమే చేపట్టేందుకు అనువుగా ఈ ఐదు ప్రాంతాలకు గతంలో రూ.63.37 కోట్లు కేటాయించింది. ఇక హోటళ్లు, విలాసవంతమైన రిసార్టులు నిర్మించేందుకు ఒబెరాయ్ గ్రూపు ముందుకొచ్చింది. దీనికనువుగా ప్రముఖ పర్యాటక ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాల్లో ఒబెరాయ్ గ్రూపునకు అవసరమైన భూములను సమకూర్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే పేరూరు (తిరుపతి), అన్నవరం, భీమిలి (విశాఖపట్టణం), గడికోట (జమ్మలమడుగు), హార్సిలీహిల్స్ (మదనపల్లె), పిచ్చుకలంక (తూ.గోదావరి) ప్రాంతాలను ఎంపిక చేసి ఒబెరాయ్ హోటల్స్‌కు అవసరమైన భూములను అందజేస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇక గడికోటకు పర్యాటకానికి అవసరమైన 50 ఎకరాలను గడికోట గ్రామంలో 2023లోనే ప్రభుత్వం కేటాయించింది. అయితే దీనికన్నా విస్తృతంగా కనుమ దృశ్యాలను, సరోవరాన్ని పర్యాటకులు వీక్షించేందుకు అనువుగా కొత్త భూమిని కేటాయించాలని ఒబెరాయ్ ప్రతిపాదించింది. దీనికనువుగానే మును పటి కేటాయింపులకు ప్రత్యామ్నాయంగా దిగువపట్నం గ్రామంలోని 50 ఎకరాలను అప్పగించేందుకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అంతేగాకుండా ప్రస్తుతం మంజూరు చేసిన 12 మీటర్ల వెడల్పు రోడ్డుకు బదులుగా 45 మీటర్ల వెడల్పుతో రోడ్డు నిర్మించాలనే ప్రతిపాదనలకు కూడా ప్రభుత్వం సానుకూలత వ్యక్తపరిచింది. కొత్తగా కేటాయించిన ప్రత్యామ్నాయ భూమిని అక్కడున్న రిజర్వాయరు గరిష్ఠ వరద స్థాయిని పరిగణనలోకి తీసుకోవాలని, బఫర్ జోన్ నిబంధనల పరిధిలో అభివృద్ధి పనులు జరగాలనే షరతులతో కొత్తగా 50 ఎకరాల ప్రత్యామ్నాయ భూమిని కేటాయిస్తూ యువజన, పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి అజయ్ జైన్ గురువారం ఆదేశాలు జారీ చేశారు.

రెండు ద్విచక్రవాహనాలు ఢీకొని యువకుడు మృతి

● ముగ్గురికి తీవ్రగాయాలు



ప్రమాదంలో మృతి చెందిన మౌలా

కురబలకోట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందగా ముగ్గురు తీవ్రంగా గాయపడ్డ విషాదకర సంఘటన గురువారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి స్థానిక పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని ముదివేడు పంచాయతీ సాహెబులవారిపల్లెకు చెందిన హసేన్‌ఖాన్ కుమారుడు మౌలా(24) చికెన్‌దుకాణంలో పనిచేస్తున్నాడు. కాగా ఇతను తన సొంతపనుల నిమిత్తం ద్విచక్రవాహనంలో అంగళ్లు వైపునకు వస్తుండగా ముదివేడు సమీపంలో మరో ద్విచక్రవాహనం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. కాగా ఈ ప్రమాదంలో మౌలా తలకు బలమైన గాయాలు కావడంతో తీవ్రంగా గాయపడ్డాడు. ఆ యకుడిని ప్రైవేట్ వాహన సాయంతో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్య చికిత్సలను అందిస్తుండగా మృతి చెందాడు. కాగా మృతుడికి ఏడాదిన్నర క్రితం వివాహమైంది. ఇతనికి భార్య, కుమారుడు ఉన్నారు. కాగా ప్రమాదం జరిగిన సంఘటనా స్థలానికి ముదివేడు పోలీసులు చేరుకుని విచారించి ప్రమాదానికి గల కారణాలను తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. ఈ మేరకు ముదివేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డాక్టర్ల నిర్లక్ష్యంతోనే మృతి

● ఆసుపత్రి ఎదుట మృతుని బంధువుల బైఠాయింపు



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న బంధువులు

మదనపల్లెఅర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కురబలకోట మండలం ముదివేడు వద్ద గురువారం సాయంత్రం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్న ప్రమాదంలో ముదివేడుకు చెందిన చికెన్ సెంటర్ వ్యాపారి హసేన్‌ఖాన్ కుమారుడు మౌలా (24) తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. చికిత్స నిమిత్తం స్థానిక జిల్లా ఆసుపత్రికి తరలించారు. అయితే సరైన వైద్యం అందించకపోవడంతో మౌలా చనిపోయాడని మృతిని బంధువులు జిల్లా ఆసుపత్రి ఎదుట రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.

ముదివేడు జాతరలో రికార్డింగ్ డ్యాన్స్‌ల హోరు...!

● అర్ధనగ్న ప్రదర్శన ● డీజే వాహనం సీజ్...
● ముగ్గురిపై కేసు నమోదు



జాతర సందర్భంగా నిర్వహిస్తున్న రికార్డింగ్ డ్యాన్స్

కురబలకోట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): పడమటి ప్రాంత మండలాల్లో ప్రసిద్ధి చెందిన ముదివేడు జాతరలో రికార్డింగ్ డ్యాన్స్‌లు హోరెత్తించాయి. మండలంలోని ముదివేడులో వెలసిన దండుమారెమ్మ జాతరను ఏటా సంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తారు. అయితే బుధవారం రాత్రి నిర్వహించిన జాతరలో పలువురు భక్తులు మొక్కులు తీర్చుకోవడానికి చాందినీ బండ్లను కట్టారు. ఈ బండ్లతో పాటు మదనపల్లె, పుంగనూరు తదితర ప్రాంతాల మహిళలు, హిజ్రాలతో కొందరు నిర్వాహకులు అర్ధనగ్న ప్రదర్శనలను నిర్వహించారు. ముదివేడు పంచాయతీ గొల్లపల్లె, నడిమిపల్లె, గ్రామాల్లో మహిళలు, హిజ్రాలతో అర్ధనగ్న ప్రదర్శనలు భారీ ఎత్తున నిర్వహించడంతో పెద్ద సంఖ్యలో యువత, ప్రజలు తరలివచ్చి తిలకించారు. రాత్రి 11 గంటల నుంచి ఉదయం 6 గంటల దాకా నిర్వహించడం గమనార్హం. ఉదయం 6 గంటలకు ముదివేడు బస్టాండుకు చేరుకోగానే అక్కడ భారీ ఎత్తున డ్యాన్స్‌లు నిర్వహించడంతో పోలీసులు అక్కడికి చేరుకుని లాఠీచార్జ్ చేసి జనాలను తరిమికొట్టారు. కాగా డీజే వాహనాన్ని, ముగ్గురు నిర్వాహకులపై ముదివేడు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఈ విషయమై మండల వ్యాప్తంగా తెలియడంతో పలువురు జోరుగా చర్చించుకుంటున్నారు.

పేలుడు పదార్థాలతో కూలీకి గాయాలు

కలకడ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోన గ్రామంలో నిర్వహిస్తున్న ఓ క్వారీలో పేలుడు పదార్థాలు పేలి రాము(45) అనే కూలీకి గాయాలైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. తమిళనాడు రాష్ట్రం ఉండమల్లైకు చెందిన రాము కోన సమీపంలో ఉన్న క్వారీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో క్వారీలో పేలుడు పదార్థాలను ఆరబెట్టి ఉంచారు. ఎండ వేడికి పేలుడు పదార్థాలు పేలాయి. ఈ నేపథ్యంలో పక్కనే ఉన్న రాముకు శరీరం కాలి బొబ్బలు వచ్చినట్లు తెలిపారు. గాయపడిన బాధితున్ని 108 వాహనంలో పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రామాంజనేయులు తెలిపారు.

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

● డ్వామా పీడీ వెంకటరత్నం



సమావేశంలో మాట్లాడుతున్న పీడీ

లక్కిరెడ్డిపల్లె, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ, జాతీయ ఉపాధి హామీపథకం పనుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పవని డ్వామా పీడీ వెంకటరత్నం పేర్కొన్నారు. గురువారం స్థానిక ఎంపీడీవో సభాభవనంలో సోషల్ ఆడిట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గత వైసీపీ ప్రభుత్వంలో 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీపథకం పనులపై 16 గ్రామ పంచాయతీల్లో జరిగిన పనులపై ఈ నెల 10 నుంచి 19 వరకు సోషల్ ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ ఆర్థిక సంవత్సరంలో 1639 పనులకు గానూ రూ.15,800 కోట్లు నిధులు విడుదల చేశారు. మెటీరియల్‌కు రూ.4,800 కోట్లు మంజూరయ్యాయి. ఈ సామాజిక తనిఖీకి 6 మంది డీఆర్‌పీలను నియమించారు. ఈ తనిఖీల్లో ఎక్కువగా అవినీతి, అక్రమాలు చోటు చేసుకున్నట్లు బయటపడ్డాయి. గత వైసీపీ ప్రభుత్వంలో ఉన్న ఉపాధి క్షేత్రస్థాయి సిబ్బంది తమ ఇష్టానుసారంగా నిధులు దుర్వినియోగం చేశారని ఉపాధి సిబ్బందిపై పీడీ మండిపడ్డారు. జేఈ వెంకటపతి, కంప్యూటర్ ఆపరేటర్ పవన్‌నాయక్, టీఏ విజయదుర్గాప్రసాదు, రాఘవేంద్రలకు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు ఏపీవో డిల్లీబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీడీ నందకుమార్‌రెడ్డి, వాటర్‌షెడ్ ఏపీడీ లక్ష్మినరసయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఉషారాణి, ఏపీడీఓ డిల్లీబాబు, టీఏలు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుడికి తీవ్రగాయాలు

● రెండుగా చీలిన కాలు ● పరిస్థితి ఆందోళనకరం



తీవ్రంగా గాయపడ్డ శ్రీనివాసులు

వ ు ల క ల చె రు వ ు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుడి కాలు రెండుగా చీలింది. దీంతో ఆయన పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు. వివరాల్లోకి వెళితే... మండలంలోని వేపూరికోట పంచాయతీ ఆవులవారిపల్లెకు చెందిన శ్రీనివాసులు (50) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తున్నాడు. పొరుగు గ్రామంలోని బండమీదపల్లెలో నిర్మాణంలో ఉన్న భవనానికి మోల్డింగ్ వేయడానికి గురువారం వెళ్లాడు. అక్కడ కరెంటు రంపంతో కొయ్యలు కోస్తుండగా ప్రమాదవశాత్తు కాలుకు తగిలి రెండుగా చీలిపోయింది. దీంతో స్థానికులు హుటాహుటిన 108 వాహనంలో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో తిరుపతి రుయాకు తరలించారు.

యువకుడు అనుమానాస్పద మృతి



అనుమానాస్పదంగా మృతిచెందిన యువకుడు

మదనపల్లెఅర్బన్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన తంబళ్లపల్లెలో చోటు చేసుకుంది. తంబళ్లపల్లె ఎస్‌ఐ లోకేశ్‌రెడ్డి వివరాల మేరకు.. తంబళ్లపల్లె మండలం, గుండ్లపల్లె గ్రామం, చెట్లవారిపల్లెకు చెందిన నవీన్‌కుమార్ (24) తంబళ్లపల్లెలోని పుడమీ మార్టు అగ్రికల్చర్ ఆగ్రో ఏజన్సీలో రెండేళ్లుగా పనిచేస్తున్నాడు. బుధవారం ఏజన్సీలో ఆడిట్ నిర్వహించి రూ.24 లక్షల సరుకు గోదాములో లేనట్లు గుర్తించారు. అక్కడే మేనేజరుగా పనిచేస్తున్న వ్యక్తి మరొకరు కలిసి నవీన్‌కుమార్‌పై నెపం మోపేందుకు యత్నించారు. గతంలో ఈ మేనేజరు మూడు ఎకరాల టమోటా సాగుకు సంబంధించి కావాల్సినవి సదరు గోదాము నుంచి తస్కరించి లెక్క చూపకుండా వాడేశారు. ఈ విషయం అంతా తెలిసిన నవీన్‌కుమార్ ఎక్కడ బయటపెడతారో అని గ్రహించి గురువారం యథావిధిగా పనికి వచ్చిన నవన్‌కుమార్‌కు అక్కడ ఉన్న పురుగుల మందు తాపించినట్లు మృతుడి తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నారు. గోదాము వద్ద అపస్మారక స్థితిలో ఉన్న నవీన్‌కుమార్‌ను ఆస్పత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. సమాచారం అందుకున్న తంబళ్లపల్లె పోలీసులు మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. గోదామ్ మేనేజరు కృష్ణమూర్తి, ఇద్దరి వర్కర్లను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు చెప్పారు. యువకుడిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

అడవులతో ఆహ్లాదం... ఆనందం



● జీవరాశులకు మనుగడ
● పచ్చదనం పెంపునకు అటవీశాఖ చర్యలు
● నేడు అంతర్జాతీయ అటవీ దినోత్సవం

ప్రతి సంవత్సరం మార్చి 21న అంతర్జాతీయ అటవీ దినోత్సవం నిర్వహిస్తారు. మొట్టమొదటి సారిగా 1971లో ఆహార వ్యవసాయ సంస్థ మార్చి 21న ప్రపంచ అటవీదినోత్సవం నిర్వహించేందుకు శ్రీకారం చుట్టింది. ఈ రోజున ప్రపంచ వ్యాప్తంగా అడవుల రక్షణ కోసం అంతర్జాతీయంగా సహకారం సమన్వయం పెంచుకుంటూ ప్రజలతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని కూడా చేపట్టనున్నారు. అంతేకాకుడా అడవుల ప్రాముఖ్యత, ఉపయోగం గురించి ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు అటవీ అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు.



కడప ఎన్టీఆర్ సర్కిల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పచ్చని అడవులు పర్యావరణానికి, జీవరాశుల మనుగడకు ఎంతో ముఖ్యపాత్రను పోషిస్తు న్నాయి. కానీ వివిధ అవసరాల కోసం మాన వులు ప్రస్తుత రోజుల్లో చెట్లను తెగనరికి అడవుల విధ్వంసానికి పాల్పడుతున్నారు. ప్రజా అవసరాల, పర్యావరణ సమతుల్యం కోసం అడువులను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది.

పచ్చదనం పెంపు

అడవుల పెంపకం ద్వారా పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చనే విధంగా ప్రజలకు అవగాహన కల్పిస్తూ పచ్చదనం పెంపునకు అట వీశాఖ చర్యలు తీసుకుంటోంది. ఈ క్రమంలో నిధుల ద్వారా ఐదు లక్షల మొక్కల పెంపకాన్ని చేపడుతున్నారు. ఇందులో 67వేల మొక్కలు అట వీశాఖ అడవుల్లో నాటడం జరుగుతుంది. మిగి లిన మొక్కలన్నీ ప్రజలకు పంపిణీ చేసి ఇంటింటా చెట్టు ఊరూరా వనం అనే విధంగా మొక్కల పెంపకాన్ని చేపట్టను న్నారు. వన్యప్రాణులను సంరక్షించేందుకు ఫేస్ ఫోర్ కెమెరా ట్రాకింగ్ ఎక్సైజ్‌లో భాగంగా టైగర్ జోన్ పరిధిలో 180 లోకేషన్‌లలో అధునాతన కెమెరాలను ఏర్పాటు చేయనున్నారు. ముద్దనూరు, వేంపల్లె మినహాయించి ఇతర అన్ని ప్రాంతా ల్లో ఈ కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు అటవీ శాఖ ఉన్నత అధికార యంత్రాంగం పేర్కొంటుంది.


కడప నగరవనం ముఖద్వారం

నగరవనాల ఏర్పాటుతో...

మనసుకు ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన నగరవనాలు మానవాళికి ఆనందం ఆహ్లాదాన్ని అంది స్తున్నాయి. జిల్లాలో కడప, బద్వేల్, గండికోట, ప్రొద్దుటూరు, పులివెందులలో నగరనాలు ఏర్పా టు చేశారు. కడప నగరంలో ప్రస్తుతం ఉన్న నగరవనానికి పక్కనే మరికొంత స్థలంలో నగర వనాన్ని విస్తరించనున్నారు. ఇందుకోసం రూ.2కోట్లు ఖర్చు చేయనుండగా కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.1.40 కోట్లు మంజూరయ్యాయి. వీటితో మరికొన్ని మొక్కల పెంపకం, మౌలిక వసతుల కల్పన, తదితర అభివృద్ధి పనులు చేపట్టను న్నారు. ప్రొద్దుటూరు పట్టణంలో ప్రస్తుతం ఉన్న ఎకో పార్కునే మరింత అభివృద్ధిపరచి ప్రజలకు నగరవనాన్ని అందుబాటులోకి తీసుకురానున్నట్లు సమాచారం. వీటితో పాటు కమలాపురం నగర పంచాయతీలోని చెప్పలి రోడ్డులో, మైదుకూరు నియోజకవర్గంలోని ముదిరెడ్డిపల్లె వద్ద కూడా నగరవనాలను ఏర్పాటు చేసేందుకు అటవీ అధికారులు ప్రతిపాదనలు పంపించారు. వన విహారిలో భాగంగా సోమశిల వెనకజలాల్లో అనువైన చోట చిల్డ్రన్స్ పార్కు, యాత్రికులు రాత్రివేళల్లో బస చేసేందుకు వీలుగా ఏర్పాటు చేయను న్నారు. అదేవిధంగా బోటింగ్ నిర్వహించేందుకు కూడా టూరిజం శాఖతో అటవీ అధికారులు సంప్రదింపులు జరుపుతున్నారు.



అడవులను సంరక్షించుకోవాలి

అడవుల ప్రాముఖ్యత, వాటి పరిరక్షణకు జరుగు తున్న ప్రయత్నాలు మన పర్యావరణ వ్యవస్థలో అవి పోషిస్తున్న కీలక పాత్ర గురించి ప్రతి ఒక్కరు అవగాహన పొంది ఉండాల్సిన అవసరం ఉంది. మీడియా ద్వారా ప్రజల్లో అవగాహన తీసుకొచ్చేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టనున్నాం. జిల్లాలో ప్రస్తుతం అనేక రకాల అటవీ సంరక్షణ కార్యక్రమాలు చేపడు తున్నాం. మన అడువులను సంరక్షంచుకోవాల్సిన బాద్యత మనందరిపై ఉంది.

-వినీత్‌కుమార్, జిల్లా అటవీ అధికారి

అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోండి

కడప మారుతీనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వారి ఆధ్వర్యంలో ఆర్మీ డైరెక్టర్ రిక్రూట్‌మెంట్ సారధ్యంలో అగ్నిపథ్ పథకం కింద అగ్నివీర్ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవాలని స్టెప్ సీఈఓ సాయిగ్రేస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో వివిధ కేటగిరీలైన అగ్నివీర్ జనరల్ డ్యూటీ, అగ్నివీర్ టెక్నికల్, అగ్నివీర్ ఆఫీసర్ అసిస్టెంట్, స్టోర్ కీపర్, ట్రేడ్‌మెన్, తదితర ఉద్యోగాల నియామకాల కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ఈ సంవత్సరం ప్రప్రథమంగా ఆన్‌లైన్‌లో కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (సీఈఈ)ను తెలుగులో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఎన్‌సీసీ-ఎ బీ అండ్ సీ సర్టిఫికెట్ గల అభ్యర్థులకు, ప్రతిభావంతులైన క్రీడాకారులకు, అగ్నివీర్ టెక్నికల్ కేటగిరి అభ్యర్థులకు, ఐటీఐ డిప్లొమా వారికి అదనపు మార్కులు ఉంటాయన్నారు. అర్హత గల అభ్యర్థులు వచ్చే ఏప్రిల్ 10వ తేదీ లోపు వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని కోరారు.

రేపు ఉద్యోగమేళా

కడప మారుతీనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ శనివారం ఉదయం 10 గంటలకు ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ (స్కిల్‌హబ్)లో ఉద్యోగమేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి సురేష్‌కుమార్ తెలిపారు. ఇందులో పేటీఎం, డోనో టీపీఓ అండ్ ఐటీ సొల్యూషన్ ప్రయివేట్ లిమిటెడ్, ఎయిల్ డిక్షిన్ (కిరణ్ సర్వీసెస్) కేఎల్ గ్రూప్ తదితర కంపెనీలలో ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్, టెలీ కాలింగ్ ఆఫీసర్, అసెంబ్లింగ్ ఆపరేటర్స్ అండ్ క్వాలిటీ, వేర్‌హౌస్ అసోసియేట్ ఉద్యోగాల కోసం 10వ తరగతి, ఇంటర్మీడియట్, ఏదీ డిగ్రీ, పోస్టుగ్రాడ్యుయేట్ విద్యార్హత కలిగి 18 నుంచి 45 సంవత్సరాల వయస్సు కలిగి వుండాలన్నారు. ఎంపికైన వారికి నెలకు 12 వేల నుంచి 25 వేల వరకు హోదాను బట్టి ఇస్తారన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలకు సంబంధించిన ధృవపత్రాలు, ఫొటోస్ తీసుకుని రావాలన్నారు.

మెడిసిన్ సామగ్రి భద్రపరచేందుకు గోడౌన్ ఏర్పాటు చేయాలి

కడప మారుతీనగర్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం ప్రభుత్వం ద్వారా వచ్చే మందుల సామగ్రి భద్రపరచుటకు వీలుగా డీఎంఅండ్ హెచ్‌వో కార్యాలయ ఆవరణలో ప్రత్యేక గోడౌన్ ఏర్పాటు చేయాలని భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) జిల్లా కార్యదర్శి చాగలమర్రి ఓబులయ్య ప్రభుత్వాన్ని కోరారు. బీజేవైఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్‌లోని జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టరు అదితిసింగ్‌ను కలిసి వినతిపత్రం అందించి మాట్లాడారు. జిల్లా ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం అవసరమైన మందుల సామగ్రి నిల్వచేయడానికి సరైన గోడౌన్ సౌకర్యం లేకపోవడంతో ఆ కార్యాలయంలోనే నిల్వ చేస్తున్నారన్నారు. ప్రభు త్వం స్పందించి గోడౌన్ సౌకర్యం కల్పించాలని కోరారు.

తెలుగుగంగ ఈఈగా క్రిష్ణారెడ్డి


బాధ్యతలు స్వీకరించిన క్రిష్ణారెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల తెలుగుగంగ ఈఈ గా క్రిష్ణారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన తెలుగుగంగ ఈఈగా, ఇన్‌చార్జ్ డీఈగా తెలుగు గంగ ప్రాజెక్టులో విధులు నిర్వహించారు. గురువారం ఆయన రెగ్యులర్ ఈఈగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా సిబ్బంది ఆయనను సన్మానించారు.

జోన్-4 పరిధిలో పలువురికి పదోన్నతులు

కడప కలెక్టరేట్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ అకౌంట్స్ డిపార్టుమెంట్‌లో గురువారం జోన్‌ల వారీగా పదోన్నతుల ప్రక్రియ జరిగింది. జోన్-4 పరిధిలో అనంతపురం, కడప, అన్నమ య్య, నంద్యాల, సత్యసాయి, చిత్తూరు జిల్లాల్లో పని చేస్తున్న11 మంది సీనియర్ అసిస్టెంట్లకు సబ్ ట్రెజరీ అధికారులుగా తాత్కాలికంగా నియ మిస్తూ ఆ శాఖ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ అకౌంట్స్ మోహన్‌రావు ఉత్తర్వులు జారీ చేశారు. రాయచోటిలో పని చేస్తున్న లక్ష్మీనారాయణ అన్నమయ్య జిల్లాలోని సబ్‌ట్రెజరీ అధికారిగా, సిద్దవటంలో పని చేస్తున్న యానాద య్యను కడపకు, పుట్టపర్తిలో పని చేస్తున్న కేశప్పను అనంతపురానికి, నంద్యాలలో పని చేసే శ్రీనివాసరాజును శ్రీశైలానికి, పుట్టపర్తిలో పనిచేసే రామాంజనేయులను రాయచోటికి, అనంతపురంలో పని చేస్తున్న జాన్ కృపాకర్‌ను మదనపల్లికి, అనంతపురంలో పని చేస్తున్న రామకృష్ణను చిత్తూరు జిల్లా పలమనేరుకు, కళ్యాణదుర్గంలో పని చేస్తున్న షబానాను నందికొట్కూరుకు, హిందుపురంలో పనిచేస్తున్న ఆదిలక్ష్మిని రాయదుర్గా నికి, ప్రొద్దుటూరులో పనిచేస్తున్న పి.ప్రమీలదేవిని అన్నమయ్య జిల్లా వాయల్పాడుకు, కడపలో పని చేస్తున్న బాబక్కను తంబళ్లపల్లికి సబ్ ట్రెజరీ అధికారులుగా నియమిస్తూ బదిలీలు చేశారు.

శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

కడప క్రైం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలోని సిబ్బంది జిల్లా పోలీసు శిక్షణ కేంద్రం (డీటీసీ)లో ని ర్వహించే శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకుకోవాలని ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ తెలిపారు. గురువారం డీటీసీలో అత్యాధునిక ఈ-క్లాస్ రూం ను ఎస్పీ ప్రారంభించారు. అధునాతన ప్రొజెక్టర్, ఇతర వసతులతో తీర్చిదిద్దా రు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఉద్యోగ జీవితంలో ఎప్పటికప్పు డు అప్‌డేట్‌గా ఉంటూ వివిధ అంశాలపై పట్టు సాధించాలని సూచించా రు. శిక్షణలో భాగంగా భవిష్యత్తులో ఉపయుక్తంగా ఉండేలా రూపొం దించిన మెటీరియల్‌ను అందించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.ప్రకాశ్ బాబు, అదనపు ఎస్పీ ఏఆర్ బి.రమణయ్య, డీటీసీ డీఎస్పీ అబ్దుల్‌కరీం, ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసరావు, పలు బ్రాంచ్‌ల సీఐలు, తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరాంపల్లెలో పట్టపగలే చోరీ

● రూ.6లక్షల విలువైన బంగారు, వెండి అపహరణ

వేంపల్లె, మార్చి 20 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని కుమ్మరాంపల్లె గ్రామ సమీ పంలో గండి-వేంపల్లె ప్రధాన రహదారి పక్కనే ఉన్న ఓ ఇంట్లో చోరీ జరిగింది. 6.50 తులం బంగారు ఆభరణాలు, కిలోన్నర వెండిచోరీ చేసినట్లు బాధితుడు మధుసూధన్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశా రు. వివరాలిలా.. కుమ్మరాం పల్లె సమీపంలో మధుసూ దన్‌రెడ్డి నివాసం ఉంటున్నా డు. గురువారం ఉదయం పని నిమి త్తం ఇంటికి తాళాలు వేసి భార్య భర్తలు వేంపల్లెకు వెళ్లారు. సాయంత్రం 7.30 గంటలకు ఇంటికెళ్లి చూడగా ఇంటి తలుపు చిలుకు బద్దలు కొట్టి ఉండడం గమనించి.. లోపలికి వెళ్లి చూడగా దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఇంట్లో ఉన్న 6.50 తులం బంగారు ఆభర ణాలు, కిలోన్నర వెండి చోరీ చేశారని.. వీటి విలువ సుమారు రూ.6ల క్షలకు పైగా ఉంటుందని బాధి తుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ సురేష్‌రెడ్డి, ఎస్ఐ రంగారావు ఘటన స్థలాన్ని పరిశీలించి.. క్లూస్ టీం ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు సీఐ తెలిపారు.

పోక్సో కేసు నమోదు

దువ్వూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఓ బాలికపై మాబూ షరీఫ్ అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడిన ఘటనపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వినోద్‌కుమార్ తెలిపారు. బాలికకు మాయమాటలు చెప్పి అఘాయిత్యానికి పాల్పడినట్లు బాధితురాలి తల్లి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు మాబూ షరీఫ్‌పై పోక్సో కేసు నమోదు చేశామని చెప్పారు.

పశువైద్య విద్యార్థుల సమ్మె విరమణ


సమ్మె విరమణ లేఖను కళాశాల డీన్ శ్రీనివాసప్రసాద్‌కు అందిస్తున్న విద్యార్థులు

ప్రొద్దుటూరు రూరల్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఉపకార వేతనాలు పెంచాలన్న డిమాండ్‌తో 45 రోజులుగా పశువైద్య కళాశాల విద్యార్థులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారంతో సుఖాంతమైంది. ప్రస్తుతం అందిస్తున్న ఉపకార వేతనాలకు 50 శాతం మేరకు పెంచుతూ ప్రభుత్వం నుంచి జీవో విడుదలైంది. ఈ సందర్భంగా కళాశాలలోని అండర్ గ్రాడ్యుయేట్ వెటర్నరీ విద్యార్థులు కాలేజీ ఆఫ్ వెటర్నరీ సైన్స్ అసోసియేట్ డీన్ శ్రీనివాసప్రసాద్‌కు సమ్మె విరమిస్తున్నట్లు లేఖను సమర్పించారు. తరగతులకు హాజరయ్యేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులు శివతరుణ్, రాహుల్, రోహిత్, రమేష్, హృదయ, తదితరులు మాట్లాడుతూ ఈ జీవోతో తాము సంతోషంగా లేమని, అయితే ప్రభుత్వ బడ్జెట్, పరిమితులను పరిగణలోకి తీసుకుని సమ్మెను తాత్కాలికంగా రద్దు చేస్తున్నామని పేర్కొన్నారు. తమ సమ్మెకు సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞత తెలిపారు.

జూన్ నాటికి గండి ఆలయాన్ని ప్రారంభించాలి

● దేవదాయ ధర్మాదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్


ఆలయాన్ని పరిశీలిస్తున్న ఆర్జేసీ, డీసీ

చక్రాయపేట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గండి వీరాజనేయ స్వామి దేవస్థాన పనులు పూర్తిచేసి జూన్ నాటికి ప్రారంభించాలని దేవదాయ ధర్మాదాయశాఖ రీజనల్ జాయింట్ కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్, కర్నూలు డిప్యూటీ కమిషనర్ పట్టెం గురుప్రసాద్‌లు పేర్కొన్నారు. గురువారం గండి అంజన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ప్రధాన అర్చకులు కేసరి, ఉప ప్రధాన అర్చకులు రాజారమేష్, ముఖ్యఅర్చకులు గోపాలస్వామి, వేదపారాయణ పండితుడు రామ్మోహన్‌శర్మలు వారికి పూర్ణఫలంతో స్వాగతం పలికి ఘనంగా పూజలు నిర్వహించారు. అనంతరం గండిలో జరుగుతున్న ఆలయ నిర్మాణ పనులను పరిశీలించారు. పనులు వేగవంతం చేసి ఎట్టిపరిస్థితుల్లో జూన్‌కు గండి అంజన్న స్వామిని భక్తులు దర్శించుకోవాలన్నారు. కొత్తగా నిర్మించే దేవాలయంలో క్యూలైన్లు, అద్దాలమండపం, ప్రహరీ, పడమర రాజ గోపురం పనులను పరిశీలించి.. త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. అలాగే దేవస్థానంలో ఆకుపూజలు, టెంకాయలు, క్యూలైన్ల ఏర్పాట్లు తదితర వాటిపై చర్చించారు. ఏది ఏమైనా ఆగమశాస్త్ర ప్రకారం దేవాలయాన్ని పరిశీలించాలని కోరారు. అనంతరం వసతి గృహాలు, ప్రసాదాలపై ఆరాతీశారు. రికార్డులను తనిఖీ చేశారు. భావితరాలకు బాసటగా గండి ఆంజనేయ స్వామి భక్తులకు నిలవాలన్నారు. ఎంతో పురాతన ఆలయమని, భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని ఒక ప్లాన్ ప్రకారం ఆలయంలో పనులు చేపట్టాలని కోరారు. దేవస్థాన మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి, దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ శివయ్య, ఈఓ విశ్వనాథరెడ్డి, ఈఓ కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

బంగారం పేరుతో బురిడీ.. వ్యక్తి అరెస్టు

● రూ.4.50 లక్షలు స్వాధీనం


మాట్లాడుతున్న డీఎస్పీ భావన, సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎస్ఐ సంజీవ రెడ్డి

ప్రొద్దుటూరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరులోని దొరసానిపల్లె రోడ్డులో కీర్తి జనరల్‌స్టోర్ నిర్వాహకులను బంగారం పేరిట నకిలీ బంగారం ఇచ్చి 5.20 లక్షల సొమ్ము కాజేసిన వ్యక్తిని ఒన్‌టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. గురువారం సాయంత్రం స్థానిక ఒన్‌టౌన్ పోలీసు స్టేషన్లో సీఐ రామక్రిష్ణారెడ్డి, ఎస్ఐ సంజీవరెడ్డితో కలిసి డీఎస్పీ భావన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. ఫిబ్రవరిలో కీర్తి జనరల్ స్టోర్‌కు చెందిన యజమాని చిట్టిబోయిన కీర్తి దుకాణంలో ఉండగా ఇద్దరు వ్యక్తులు తాము భార్యభర్తలమని.. ఇదే ఏరియాలో నివాసం ఉంటున్నామని తెలిపారు. జనరల్ స్టోర్‌లో సరుకులు కొనేవారమని తాము బెంగుళూరులో బిల్డింగ్ పనుల కోసం గుంతలు తీస్తుండగా బంగారు బిస్కెట్లు దొరికాయని చెప్పారు. ఫిబ్రవరి 21 కీర్తి జనరల్ స్టోర్‌కు వెళ్లిన మహిళ తమ వద్ద బంగారు బిస్కట్‌వుందని.. తక్కువ ధరకే ఇస్తామని చెప్పగా కీర్తి తన భర్తను అడిగి చెప్తానన్నారు. మరుసటి రోజు మరోసారి ఆ మహిళ భర్త వెళ్లి బంగారు రూ25 లక్షలు అవుతుందని మీకు కేవలం రూ.5లక్షలకే ఇస్తామంటూ బంగారు పరీక్షించుకోవచ్చని ఒక బంగారు ముక్క ఇచ్చారన్నారు. దాన్ని బంగారు దుకాణంలో పరీక్షించగా అది నాణ్యతకలదని తెలియడంతో కీర్తి రామకృష్ణ దంపతులు బంగారు బిస్కెట్ కొనేందుకు ఆసక్తి చూపి ఫిబ్రవరి 23న వారి నుంచి బంగారు బిస్కెట్ రూ.5.20 లక్షలు ఇచ్చి తీసుకున్నారన్నారు. ఆ తరువాత బిస్కెట్ నాణ్యతను బంగారు దుకాణంకు వెళ్లి పరీక్షించగా అది నకిలీదని తేలిపోయిందన్నారు. దీంతో దాన్ని విక్రయించిన వారికి ఫోన్‌చేయగా వారి ఫోన్‌స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో మోసపోయామని గుర్తించి ఒన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదుచేశారు. వారి ఫిర్యాదు మేరకు నకిలీ బంగారంతో బురిడీ కొట్టించిన వారికోసం గాలింపు మొదలెట్టామన్నారు. గురువారం మధ్యాహ్నం మెయిన్ బజార్‌లోని కళా మందిర్ వద్ద నిందితుడు బండారు నాగేశ్వరరావును అరెస్టు చేసి.. అతని వద్ద నుంచి రూ.4,50,000లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని.. త్వరలో పట్టుకుంటామన్నారు.

దిగుబడి రాక.. ధరలు లేక !


పత్తి పంట

రాజుపాలెం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఆరుగాలం కష్టించే రైతన్నలకు కష్టనష్టాలు తప్పడం లేదు. ఈ ఏడాది పత్తిపంట సాగు చేసిన రైత న్నలు దిగుబడి రాక.. ధరలు లేక దిగాలు చెందుతున్నారు. ఎకరాకు నాలుగు నుంచి ఐదు క్వింటాళ్ల దిగుబడి మాత్రం వస్తోంది. దీనికితోడు పత్తి కొనుగోలుకు వ్యాపారస్తులు ముందుకు రాకపోవడం, జిల్లాలో పత్తి కొనుగోలు కేంద్రాలు లేకపోవడం కూడా ధరలు లేకపోవడానికి కారణమని రైతులు చెబుతున్నారు.

● ఆందోళనలో పత్తి రైతులు

ప్రస్తుతం క్వింటా రూ.4500 నుంచి 5500 ధర పలుకుతోంది. దీంతో తాము తీవ్రంగా నష్టపోతున్నామని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించి కొనుగోలు చేయాలని కోరుతున్నారు. కాగా, మండ లంలో గతంలో 12వేల నుంచి 15వేల ఎకరాల్లో పత్తి పంట సాగు చేసేవారు. రానురాను పత్తి పంటకు తెగుళ్లు ఆశించడం, ధరలు లేకపోవడంతో కొంత మంది రైతులు పత్తి సాగు చేయడం మానుకున్నారు. ప్రత్యామ్నాయ పంటలైన మినుము, జొన్న తదితర పంటల వైపు మొగ్గు చూపుతున్నారు. గతంలో గుంటూరు, ఆదోని, తదితర మార్కెట్ల ద్వారా మిల్లులకు సంవత్సరానికి రాజుపాలెం మండలం నుంచి 200 నుంచి 400 లారీలు పత్తి ఎగుమతి చేసేవారు. నేడు 50 లారీలు పత్తి కూడా పంపే పరిస్థితి లేదు.


లారీకి లోడు చేసిన పత్తి

జాతీయస్థాయి చెస్ పోటీల్లో లాస్యశ్రీ ప్రతిభ


లాస్యశ్రీని అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

కడప స్పోర్ట్స్, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల మహారాష్ట్ర నారదవాడ జిల్లాలో జరిగిన స్కూలు గేమ్స్ చెస్ అండర్ 17 కేటగిరి జాతీయస్థాయి పోటీల్లో నగర గాంధీ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ స్కూలు విద్యార్థిని లాస్యశ్రీ బ్రాంచ్ మెడల్ సాధించారు. ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు షేక్ ఆషిఫున్ గురువారం లాస్యశ్రీని అభినందించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. తద్వారా ఇటు తల్లిదండ్రులకు అటు పాఠశాలకు మంచి పేరు తీసుకు రావాలన్నారు. కాగా రాష్ట్రస్థాయిలో విజయం సాధించి జాతీయ స్థాయిలో సైతం లాస్యశ్రీ రాణించి బ్రాంచ్ మెడల్ సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు.

చేపల చెరువు వేలానికి ఆధిపత్య పోరు

● తేదీని ప్రకటిస్తామని అధికారుల వెల్లడి

● ధరావత్తు సొమ్మును వెనక్కు తీసుకోవాలని సూచన



చేపల చెరువు వేలం రద్దు చేస్తున్నట్లు చదివి వినిపిస్తున్న అధికారులు

పెద్దతిప్పసముద్రం మార్చి 20 (ఆంధ్రజ్యోతి): రాపూరివాండ్లపల్లె పంచాయతీ రంగసముద్రం పెద్దచెరువు 1434 ఫసలీకి సంబంధించి గురువారం వేలం నిర్వహిస్తామని పంచాయతీ కార్యదర్శి ఇటీవల తెలియజేశారు. అయితే ఇదే గ్రామంలో కొందరు నేతల మధ్య ఆధిపత్య పోరు కారణంగా 19 వతేదీన ధరావత్తు సొమ్మును కొందరే చెల్లించారు. నేతల మధ్య సమన్వయం లేకుండా పోవడంతో గురువారం వేలాన్ని వాయిదా వేసి బహిరంగంగా జరపాలని ఓ వర్గం పట్టుపట్టడంతో అధికారులు వాయిదా వేశారు. తదుపరి వేలం నిర్వహణ తేదీని అందరికీ తెలియజేస్తామని పంచాయతీ అధికారులు వెల్లడించారు. కాగా వేలం కోసం కొందరు కట్టిన ధరావత్తు సొమ్మును వాపసు తీసుకోవడానికి నిరాకరించారని, ధరావత్తు సొమ్మును కట్టిన వారు సచివాలయానికి వచ్చి తీసుకు వెళ్లాలని కార్యదర్శి సురేఖ కోరారు.

చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం



చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

పీలేరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): తమకు చేయూతనిచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పీలేరులో చేనేత కార్మికులు గురువారం పాలాభిషేకం చేశారు. చేనేత కార్మికుల ఇళ్ల నిర్మాణాలకు అదనంగా రూ.50 వేల సాయం, జీఎస్టీ రీయింబర్స్‌మెంట్, చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్ లూమ్స్ ఉన్న వారికి 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చేందుకు మంత్రి మండలి గురువారం ఆమోదించిన నేపథ్యంలో వారు ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. చేనేత ఐక్యవేదిక రాష్ట్ర అధికార ప్రతినిధి, టీడీపీ సీనియర్ నేత పోలిశెట్టి సురేంద్ర మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చడం సంతోషంగా ఉందన్నారు. యువగళం పాదయాత్రలో చేనేత కార్మికుల కష్టాలను స్వయంగా చూసిన యువనేత నారా లోకేశ్ ఉచిత విద్యుత్ అందిస్తామని హామీ ఇచ్చి నెరవేర్చారని గుర్తు చేశారు. చేనేత వస్త్రాలకు మార్కెటింగ్ కల్పించేందుకు ప్రభుత్వం అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో జరిగిన కార్యక్రమంలో చేనేత సంఘ నేతలు మడక మదన్మోహన్, విశ్రాంత ఉపాధ్యాయులు వెంకటరామయ్య, జోకా నాగరాజా, దొండ్ల ఈశ్వరయ్య, జ్యోతి, తులసీ కుమారి పాల్గొన్నారు.

అధికారులపై అసత్య ఆరోపణలు తగదు

పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావు హెచ్చరిక

పీలేరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నిత్యం ప్రజాసేవలో మునిగితేలే అధికారులపై అసత్య, అనుచిత, అనైతిక వ్యాఖ్యలు చేయడం తగదని పీలేరు తహసీల్దారు భీమేశ్వర రావు హెచ్చరించారు. తన కార్యాలయంలో గురువారం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ పీలేరులో పనిచేస్తున్న అధికారులపై ఇటీవల కొందరు కుల, విద్యార్థి, వామపక్ష సంఘ నేతలు సామాజిక మాధ్యమాల్లో అదే పనిగా దూషణలకు దిగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వారు చెప్పినట్లు వినని అధికారులను టార్గెట్ చేస్తూ సోషియల్ మీడియాలో పోస్టులు పెట్టడం, వ్యాట్సాప్ గ్రూపుల్లో వ్యాఖ్యలు చేయడం, ఏకవచనంతో సంబోధించడం, దూషిస్తూ వీడియోలు చేయడం వంటి విపరీత ధోరణి మంచిదికాదన్నారు. ప్రతి పనికీ ఒక నిర్దేశిత నియమం, సమయం ఉంటుందని, వాటిని సమన్వయం చేసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తుంటామన్నారు. ఉద్యోగుల ఆత్మవిశ్వాసం దెబ్బతినేలా, మనవళ్ల వయస్సున్న వారు ఏకవచనంతో సంబోధించడం, మరికొందరు బెదిరించడం చూస్తుంటే పీలేరులో ఉద్యోగం మానేసి వెళ్లిపోదామనిపిస్తోందన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు వైసీపీ ప్రభుత్వంలో జరిగిన భూ ఆక్రమణల పునఃవిచారణ ప్రారంభించిన నాటి నుంచీ తనకు బెదిరింపులు, బుజ్జగింపులు, ఇంటి చుట్టూ రెక్కీలు ఎక్కువైపోయాని, వాటితోనే వేగలేక ఆందోళన పడుతుంటే చేయని పనికి కులసంఘాల నేతలు అసత్య ఆరోపణలు చేయడం బాధిస్తోందన్నారు. ఈ బెదిరింపుల ధోరణి ఇలాగే కొనసాగితే పీలేరులో ఉద్యోగం చేయడానికి ఎవరూ ముందుకు వచ్చే పరిస్థితి ఉండదన్నారు. ఇప్పటికే అన్ని శాఖల్లోనూ పీలేరు అంటే భయపడుతున్నారని ఆయన వాపోయారు. భవిష్యత్తులో తనపై ఎవరు ఆరోపణలు, వ్యాఖ్యలు చేసినా చట్టపర చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అర్బన్ సీఐ యుగంధర్ మాట్లాడుతూ ప్రభుత్వ అధికారులపై అనుచిత వ్యాఖ్యలు చేసే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాట్సాప్ గ్రూపుల్లోని అడ్మిన్‌లు కూడా ఆయా గ్రూపుల్లోని సభ్యుల వ్యాఖ్యలకు బాధ్యులవుతారని, తమ గ్రూపుల్లోని సభ్యులను అడ్మిన్‌లు నియంత్రణలో పెట్టాలన్నారు.

'ఎంపీపీగా అవకాశం ఇవ్వండి'



ఏఓకు వినతి పత్రం ఇస్తున్న వైస్ ఎంపీపీ భూదేవి

కురబలకోట, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సెలవుపై వెళనున్న కురబలకోట ఎంపీపీ దస్తగిరిసాహెబ్ స్థానంలో తనకు ఎంపీపీగా అవకాశం ఇవ్వాలని వైస్ ఎంపీపీ భూదేవి ఏఓకు వినతి పత్రం అందజేశారు. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీ అన్ని స్థానాలను ఏకగ్రీవం చేసుకున్నారు. అయితే అంగళ్ల ఎంపీటీసీ స్థానం నుంచి ఎన్నికైన దస్తగిరి సాహెబ్‌కు ఎంపీపీగా అవకాశం కల్పించారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల్లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రజాస్వామ్య ప్రకారం ఎన్నికల్లో పోటీ చేసి గెలవకుండానే పదవులు అనుభవిస్తున్నారని నిరసిస్తూ పలుమార్లు మండల సమావేశాన్ని టీడీపీ శ్రేణులు అడ్డుకున్నారు. దీంతో వైసీపీ శ్రేణులు కోర్టు ద్వారా గట్టి పోలీసు బందోబస్తు నడుమ మండల సమావేశం నిర్వహించారు. కాగా ప్రస్తుతం వైసీపీ నేతల ఒత్తిళ్లతో ఎంపీపీ సెలవు పెట్టాడని పలువురు బహిరంగా ఆరోపిస్తున్నారు. అంతేకాకుండా వైస్ ఎంపీపీ భూదేవికి ఎంపీపీ బాధ్యతలను అప్పగించాలని ఆయన వినతి పత్రంలో పేర్కొన్నారు. అయితే ఆయనకు సీఈఓ సెలవు మంజూరు చేయకనే తనకు అవకాశం ఇవ్వాలని వైస్ ఎంపీపీ తనకు మద్దతుగా నిలిచిన ఎంపీటీసీలతో ఏఓకు వినతిపత్రం అందజేశారు. మండలంలో ఇద్దరు వైస్ ఎంపీపీలు ఉండగా మరో వైస్ ఎంపీపీ వెంకటరమణారెడ్డి తాను వైస్ ఎంపీపీ పదవికి రాజీనామా చేయనున్నట్లు ప్రకటించారు. ఈ విషయమై ఏఓ నాగరాజ మాట్లాడుతూ ఎంపీపీ ఎన్నిక చట్ట ప్రకారం జరుగుతుందని వీరు ఇచ్చిన వినతిని ఉన్నతాధికారులకు అందజేసి తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. అయితే ఆమెను వైసీపీ నేతలు అభినందించారు.

సుశిక్షితులైన బోధకులుగా మారాలి

పిల్లల పట్ల శ్రద్ధ వహించాలి ● చిన్నారులకు అర్థమయ్యేలా నేర్పాలి

'పోషణ్-భీ.. పఢాయి-భీ' శిక్షణ ప్రారంభంలో సీడీపీఓ భారతి, పీలేరు ఎంఈఓ లోకేశ్వర్





వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ ఇస్తున్న సూపర్‌వైజర్లు - తంబళ్లపల్లెలో అంగన్వాడీ టీచర్లకు శిక్షణ ఇస్తున్న సీడీపీఓ నాగవేణి

వాల్మీకిపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): 'పోషణ్ భీ-పఢాయి భీ' శిక్షణ ద్వారా సుశిక్షితులైన బోధకులుగా మారాలని వాల్మీకిపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ భారతి పేర్కొన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లల ఆరోగ్యం, విద్య, పోషణ పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. గురువారం మండలంలోని అంగన్వాడీ కార్యకర్తలకు 'పోషణ్-భీ పఢాయి-భీ' అంశంపై మూడు రోజుల శిక్షణలో ఆమె మాట్లాడుతూ ఆరేళ్లలోపు పిల్లలకు ఆరోగ్యం, విద్య ఎంత అవసరమో, మూడేళ్లలోపు పిల్లలకు నవచేతన అని, మూడు నుంచి ఆరేళ్లలోపు పిల్లల అభివృద్ధి గురించి అంగన్వాడీ కార్యకర్తలకు తెలియజేశారు. ప్రాజెక్టు పరిధిలోని ప్రతి అంగన్వాడీ కార్యకర్త విధి విధానాల ద్వారా బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సూపర్‌వైజర్ రోహిణి కుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్నారుల మనసుకు దగ్గరయ్యేలా...

పీలేరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ టీచర్లు ఆట పాటలు, బొమ్మలతో చిన్నారుల మనసుకు దగ్గరయ్యేలా మెలకువలు అందిపుచ్చుకోవాలని పీలేరు ఎంఈఓ లోకేశ్వర్ రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రారంభమైన రెండో విడత శిక్షణలో కేవీపల్లె మండలాల్లోని అంగన్ వాడీ కార్యకర్తలకు పవర్ పాయింట్ ప్రెజెంటేషన్, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నవచేతన, పిల్లల మెదడు అభివృద్ధి, పోషణ గురించి తెలియజేశారు. కార్యక్రమంలో సీడీపీఓ రాజమ్మ, ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి, సూపర్‌వైజర్లు అక్కాయమ్మ, స్వరూప, స్వర్ణ, ఉమ పాల్గొన్నారు.

చిన్నారులకు అర్థమయ్యేలా నేర్పాలి

మదనపల్లె టౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అర్థమయ్యే రీతిలో



మదనపల్లెలో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇస్తున్న సీడీపీఓ సుజాత

విద్యాబుద్ధులు నేర్పాలని సీడీపీఓ సుజాత అన్నారు. స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శాంతమ్మ, భానులక్ష్మీ, చంద్రకాంత, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల నైపుణ్యాన్ని పెంచాలి

తంబళ్లపల్లె, మార్చి 20(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీ కేంద్రాల్లో చిన్నారులకు నాణ్యతతో కూడిన విద్య, బాల్య సంరక్షణ అందుతుందని సీడీపీఓ నాగవేణి అన్నారు. గురువారం కన్నెమడుగు, గోపిదిన్నె హైస్కూల్స్‌లో అంగన్వాడీ టీచర్ల పిల్లల నైపుణ్యాన్ని పెంచే అంశాలపై శిక్షణ ఇచ్చారు.

శక్తివంతమైన పౌరులుగా తీర్చాలి

పెద్దతిప్పసముద్రం మార్చి 20 (ఆంధ్రజ్యోతి): శక్తివంతమైన పౌరులుగా, ఆరోగ్యవంతులుగా, మేధావులుగా తయారు చేయడమే ముఖ్య ఉద్దేశమని ఎంఈఓ నారాయణ అన్నారు. బి. కొత్తకోట ఐసీడీఎస్ పరిధి అంగన్‌వాడీ కార్యకర్తలకు మండల స్థాయి శిక్షణ నిర్వహించారు. పోషకాలతో కూడిన సమతుల్య ఆహారం బిడ్డకు తల్లిగర్భం నుంచీ అందాలన్నారు. పరిశుభ్రత, ఆహారం, ఆరోగ్యం, సామాజిక విలువలు తెలియచేయడమే శిక్షణ తరగతుల్లో కార్యకర్తలు పాల్గొన్నారు.

అంతరిస్తున్న పిచ్చుకలకు గూడు కల్పిద్దాం..



ప్లకార్డులతో అవగాహన కల్పిస్తున్న ప్రభుచరణ్, విద్యార్థులు

వాల్మీకిపురం, మార్చి 20(ఆంధ్రజ్యోతి): భూమిపై అంతరించి పోతున్న పిచ్చుకల జాతికి గూడు కల్పిద్దామని జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు ప్రభుచరణ్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా వాల్మీకిపురం గ్రేస్ గార్డెన్ పాఠశాలలో గురువారం చేపట్టిన అవగాహనలో ఆయన మాట్లాడుతూ గతంలో పిచ్చుకలు పెంకుటిండ్లు, తాటాకుల ఇళ్లు, చెట్లు, చేమా, సూరిళ్లలో గూళ్లు కట్టుకుని ఇళ్ల ఆవరణాల్లో పడిన బియ్యం, పప్పు గింజలు తింటూ ఇళ్లలో తిరిగే పురుగులను తిని జీవించేవన్నారు. ప్రస్తుతం వాటికి నివాసాలు లేక పంట పొలాల్లో చల్లే పురుగుల మందులు, సెల్‌టవర్ల రేడియేషన్ కారణంగా పిచ్చుకలు పెద్దసంఖ్యలో అంతరించి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. మానవత్వంతో పిచ్చుకల జాతిని కాపాడుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ బాబుజాన్, ప్రిన్సిపాల్ ఆయేషాబాను, ఉపాధ్యాయులు కృష్ణవేణి, లావణ్య, కాజల్, లిల్లీమ్యాథ్యూస్, సల్మా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంయూఏ నూతన కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన డిపో కమిటీ సభ్యులను సన్మానిస్తున్న ఎన్‌ఎంయూఏ నేతలు

పీలేరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్(ఎన్‌ఎంయూఏ) పీలేరు డిపో నూతన కార్యవర్గ ఎన్నిక గురువారం జరిగింది. స్థానిక షఫీ కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో డిపో సలహాదారుగా సుబ్బరామయ్య, ఛైర్మన్‌గా ఏఆర్ చంద్ర, వైస్ ఛైర్మన్‌గా బీడీ నాయక్, డిపో అధ్యక్షుడిగా సీవీ రమణ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కె.హరినాథ్, కార్యదర్శిగా ఆదినారాయణ, కోశాధికారిగా కె.రఘు, సహాయ కోశాధికారిగా జి.ప్రసాద్, కమిటీ సభ్యులుగా సుజాత, రోజారమణి, షాహినా, రేణుక, రాధారాణి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన కార్యవర్గసభ్యులను నేతలు, కార్మికులు సన్మానించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస రాజు, జోనల్ కార్యదర్శి చెన్నారెడ్డి, ఎంసీ మెంబర్ వినోద్ బాబు, పీలేరు డిపో గౌరవాధ్యక్షుడు రెడ్డప్ప రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.ఎన్. రావు, పీఎస్ ఎం రాజు, రీజనల్ కమిటీ సభ్యులు ప్రమీల, శ్రీరాములు, సుధాకర్ పాల్గొన్నారు.

బాలకార్మికులను ప్రోత్సహించడం నేరం



బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పీలేరు, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): బాల కార్మికులను, ఆ వ్యవస్థను ప్రోత్సహించడం నేరమని పీలేరు కార్మిక శాఖాధికారి ఆనంద్ బాబు అన్నారు. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం ప్రభుత్వం, ఏపీ సీఐడీ, కార్మిక శాఖ సంయుక్తంగా చేపట్టిన 'ఆపరేషన్ స్వేచ్ఛ, ఫేస్-3'లో ఇతర శాఖాధికారులతో కలిసి పట్టణంలోని దుకాణాలు, హోటళ్లు, వాణిజ్య సముదాయాల్లో తనిఖీ చేపట్టిన ఆయన మాట్లాడుతూ రాష్ట్రాన్ని బాల కార్మిక వ్యవస్థ రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. విద్యాహక్కు చట్టం మేరకు బడి ఈడు పిల్లలందరూ బడుల్లో ఉండేలా తగిన ఏర్పాట్లు చేస్తోందన్నారు. బాల కార్మికులను ప్రోత్సహించిన వారికి రెండేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.20 వేల నుంచి రూ.50 వేల దాకా జరిమానా ఉంటుందన్నారు. అనంతరం పట్టణంలో ర్యాలీ చేశారు. ఎంఈఓ లోకేశ్వర్ రెడ్డి, పారా లీగల్ వలంటీర్ గట్టప్ప, చైల్డ్ హెల్ప్‌లైన్, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది లావణ్య, రాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

క్షయ అంతం... మోదీ పంతం

ములకలచెరువు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): క్షయ అంతం ప్రధాని మోదీ పంతమని తంబళ్లపల్లె టీ బీ సూపర్‌వైజర్ రామకృష్ణనాయుడు పేర్కొన్నారు. సెంట్రల్ స్కూల్‌లో క్షయ వ్యాధి నివారణా వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన మాట్లాడారు. ఎంఎల్‌హెచ్ పావని, ఏఎన్‌ఎం గీతా, ఆశా కార్యకర్తలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

వెంకోజిగారిపల్లెలో తాగునీటి సమస్య

నిమ్మనపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కొండయ్యగారిపల్లి పంచాయతీ వెంకోజిగారిపల్లిలో రెండు నెలలుగా తాగునీటికి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు 400 కుటుంబాలున్న గ్రామంలో ఒక్క బోరే వుండడంతో నీటి సరఫరా సక్రమంగా జరగలేదు. ముఖ్యంగా బొంగవారిపల్లి, స్థానిక ప్రభుత్వ పాఠశాలకు తాగునీరు లేక ట్యాంకర్ల సహాయంతో నీటిని సరఫరా చేస్తున్నారు. వెంకోజిగారిపల్లిలో తాగునీటి సమస్య సంబంధిత అధికారులకు తెలిపితే వారు స్పందించలేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో కొందరు ప్రైవేటు ట్యాంకర్లను ఆశ్రయిస్తున్నారు. ఈ విషయంపై కార్యదర్శి రాజేష్‌ను వివరణ కోరగా సర్పంచ్ అందుబాటులో లేరని ఆమె వచ్చిన తరువాత పైప్‌లైన్‌లు చూస్తామని అంత వరకూ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేసున్నట్లు తెలిపారు. అయితే గ్రామస్తులు మాట్లాడుతూ తమకు తాగునీటి సమస్యను తీర్చాలని కోరుతున్నారు.

ముదివేడులో ముగిసిన దండుమారెమ్మ జాతర



కురబలకోట, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ముదివేడులో దండుమారెమ్మ జాతర ముగిసింది. పడమటి మండలాల్లో ప్రసిద్ధి చెందిన ఈ జాతరను రెండు రోజులు వైభవంగా నిర్వహించారు. జాతరకు భక్తులు పోటెత్తారు. అమ్మవారిని ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించి, చాందినీ బండ్లను ఊరేగించారు.

వృత్తి పరికరాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

కలికిరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): కుల వృత్తులపై ఆధారపడిన బీసీ కులాల వారు తమకు అవసరమైన వృత్తి పనిముట్లు కోసం దరఖాస్తులు పంపుకోవాలని ఎంపీడీఓ భానుమూర్తి రావు కోరారు. సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంటు వద్ద ఏఏ పరికరాలు కావాలో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. బీసీలకు వృత్తి పరంగా అవసరమయ్యే పనిముట్లను సరఫరా చేస్తామన్నారు. కులం సర్టిఫికెట్టు, ఆధార్ కార్డు జిరాక్సును తీసుకెళ్లి 27వ తేదీ లోగా నమోదు చేసుకోవాలని ఎంపీడీఓ ఒక ప్రకటనలో కోరారు.

చేతి వృత్తులతో ఆర్థికాభివృద్ధి

పెద్దమండ్యం, మార్చి 20(ఆంధ్రజ్యోతి) చేతి వృత్తుల నైపుణ్యంతో ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎంపీడీఓ శ్రీధర్‌రావు పేర్కొన్నారు. స్థానిక కార్యాలయంలో బీసీ సంఘ నేతలు, చేతి వృత్తుల వారితో ఆదరణ-3పై అవగాహన కల్పించారు. పరికరాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు.

నేడు జేఎన్టీయూలో క్రీడలు

కలికిరి, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ కాలేజీ వార్షిక క్రీడా పోటీలు శుక్రవారం నుంచి స్థానిక జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో జరగనున్నట్లు ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావు తెలిపారు. అనంతపురం జేఎన్టీయూ రిజిస్ట్రారు ఎస్.కృష్ణయ్య ఈ క్రీడా పోటీలను ప్రారంభిస్తారని చెప్పారు. యూనివర్శిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యదర్శి టి.నారాయణ రెడ్డి పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా వున్న 30 ఇంజనీరింగ్ కళాశాలల నుంచి 950 మందికి పైబడిన విద్యార్థులు పాల్గొనబోతున్నట్లు పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ వద్దు

నిమ్మనపల్లి, మార్చి 20(ఆంధ్రజ్యోతి): 'రాజ్యాంగం ముద్దు.. ఎస్సీ వర్గీకరణ వద్దు' నినాదంతో తిరుపతిలో జరగబోయే మాలమహానాడు సింహగర్జనను విజయవతం చేయాలని మండల అధ్యక్షుడు వీరణాలమాణిక్యం పేర్కొన్నారు. గంగాపురంపల్లి, తరిగొండవారిపల్లి, బండమీద మాలపల్లి, కొత్తపల్లి, నల్లగొండ హరిజనవాడల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. 23న జరగబోయే మాలల సిహగర్జనను విజయవంతం చేయాలని కోరారు. జయన్న, యర్రయ్య, శ్రీరాములు, సుధాకర్ పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్యాయత్నం

మదనపల్లెఅర్బన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఘర్షణ కారణంగా యువకుడు ధర్మనందన ఆత్మహత్యకు యత్నించినట్లు పోలీసులు తెలిపారు. వివరాల్లోకెళితే.... నిమ్మనపల్లె మండలం, వెంగంవారిపల్లె పంచాయతీ, కొత్తకొండ సానివారిపల్లె వాసి బాలకృష్ణ కుమారుడు ధర్మనందన, కుమార్తె వెన్నెల ఉన్నారు. కుమార్తెకు గ్రామంలోనే రాజుతో వివాహమైంది. కాగా రాజు ఉపాధి నిమిత్తం బెంగళూరుకు వెళ్లాడు. డిగ్రీ పూర్తి చేసిన ధర్మనందన గ్రామంలోనే పనులకు వెళుతున్నాడు. తండ్రి రోజూ మద్యం తాగి తన అక్క వెన్నెలతో గొడవ పడతుంటే అసహనంతో ఇంట్లోని ఈగల మందును నీళ్లలో వేసుకుని పక్కనే ఉన్న మామిడితోటలో తాగి పడిపోయాడు. గమనించిన కుటుంబసభ్యులు యువకుడిని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతున్నారు. నిమ్మనపల్లె పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్‌ఓబీ నిర్మాణానికి రైతులు సహకరించాలి



రైతులతో చర్చిస్తున్న సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె టౌన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): సీటీఎం వద్ద నిర్మిస్తున్న ఆర్‌ఓబీ (రైల్వే ఓవర్ బ్రిడ్జి) నిర్మాణానికి అవసరమైన భూసేకరణకు రైతులు సహకరించాలని సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ కోరారు. గురువారం స్థానిక సబ్‌కలెక్టరేట్‌లో సీటీఎం రైతులతో చర్చించిన ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఆర్‌ఓబీ నిర్మాణానికి 11 హెక్టార్ల భూమి అవసరమన్నారు. ఇప్పటికే కొందరు రైతులు ముందుకు వచ్చి భూమి ఇచ్చారని, మిగిలిన రైతులు కూడా భూసేకరణకు సహకరిస్తే వారికి న్యాయమైన నష్టపరిహారం అందించేందుకు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. దీనిపై రైతులు చర్చించుకుని చెబుతామన్నారు. కార్యక్రమంలో భూసేకరణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

వలసపల్లెలో భూముల రీ సర్వే



రీ సర్వేలో పాల్గొన్న తహసీల్దార్ ధనంజయులు

మదనపల్లె అర్బన్, మార్చి 20(ఆంధ్రజ్యోతి): వలసపల్లెలో గురువారం రెవెన్యూ సిబ్బందితో కలిసి తహసీల్దార్ ధనంజయులు భూముల రీ సర్వే నిర్వహించారు. ఇందులో వలసపల్లె రెవెన్యూ భూముల రికార్డులను క్షేత్ర స్థాయిలో పరిశీలించి రీ సర్వే చేశారు. పీజీఆర్‌ఎస్, హౌసింగ్ అర్జీలను పరిశీలించారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ రెడ్డి శేఖర్, వీర్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన విద్యార్థినులతో ఉపాధ్యాయ బృందం

పీలేరు, మార్చి 20(ఆంధ్రజ్యోతి): కరాటేలో విజేతలైన నలుగురు విద్యార్థినులకు జంగంపల్లె జడ్పీ హైస్కూల్‌లో గురువారం బంగారు పతకాలు అందించారు. పాఠశాల హెచ్‌ఎం గంగాధరం, కరాటే మాస్టర్ దాము మాట్లాడుతూ పాఠశాలలో గురువారం జరిగిన పోటీల్లో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు 45 మంది బాలికలు వివిధ విభాగాల్లో పాల్గొనగా వారిలో కె.యల్లమ్మ, బి.కేదారేశ్వరి, కె.హరిక, సి.అక్షర విజేతలుగా నిలిచారన్నారు. ఉపాధ్యాయులు రేణుక, షరీఫ్, బీవీ రమణ, రామ్మూర్తి, రమణయ్య, ఆనందరాజు, అశోక్ కుమార్ రడ్డి, ఎస్‌ఎండీ ఫరూఖ్, విజయలక్ష్మి పాల్గొన్నారు.

ఈకేవైసీని పూర్తి చేయించండి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీనివాసులు

గుర్రంకొండ, మార్చి 20(ఆంధ్రజ్యోతి): ఈకేవైసీ పెండింగ్‌ను పూర్తి చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు గ్రామాల్లోని రేషన్ డీలర్లకు సూచించారు. గురువారం కార్యాలయంలో డీలర్లతో మాట్లాడుతూ ఈకేవైసీని సకాలంలో పూర్తి చేయాలన్నారు. ప్రజలకు నిత్యావసరాలను ప్రభుత్వం నిర్ధేశించిన ధరలకే అమ్మాలన్నారు. సీఎస్ డీటీ ఫజ్జులుల్లా, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఇసుక రీచ్ కోసం పాపాఘ్ని నది పరిశీలన



ఇసుక రీచ్ కోసం పరిశీలిస్తున్న మైనింగ్ అధికారులు

పెద్దతిప్పసముద్రం, మార్చి 20 (ఆంధ్రజ్యోతి): గృహనిర్మాణాల కోసం ప్రభుత్వం ఉచిత ఇసుకను అందించేందుకు టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లె వద్ద పాపాఘ్ని నదిలోని రామాపురం ఇసుక రీచ్‌ను పరిశీలించారు. ఇసుక రీచ్‌ను మైనింగ్ టెక్నికల్ అసిస్టెంట్ వెంకటయ్య రెవెన్యూ సిబ్బంది పరిశీలించి ఇక్కడ ఇసుక తగినంత లేదన్నారు. వైసీపీ పాలనలో మైనింగ్ అధికారులు నిర్దేశించిన దానికంటే రెట్టింపు ఇసుకను తరలించారని, ఇక్కడ రీచ్ ఏర్పాటు చేసే అవకాశాలు లేవని మైనింగ్ అధికారి సూచించారు. వీఆర్వో అమరనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ బాలచంద్రాచారి, సర్వేయర్లు, తదితరులు పాల్గొన్నారు.